TELTEL/2016/69862

# జనం పవర్

తెలుగు దినపత్రిక

సంపుటి: 10 | సంచిక:47 | వెల:05


15-07-2025, మంగళవారం




EDITOR:
BANDARI MARUTHI

# రేవంత్ సర్కారుకు పథకాల భారం

హామీలు అమలు చేయలేక ఆపసోపాలు




- నిధుల సమీకరణ, ఆర్థిక నిర్వహణకు ఇబ్బందులు
- భారీగా రుణాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఉన్న పథకాలకు తోడు కొత్త పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి
- ఓటు బ్యాంకుగా మారిన కొన్ని సంక్షేమ పథకాలు
- వాటిని అమలు చేయలేక తప్పని పరిస్థితి
- ఫీజు రియింబర్స్ మెంట్ లాంటి పథకాల అమలు కష్టమే..

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆర్థికంగా భారంగా మారుతున్నాయని, రాష్ట్ర ఆదాయం ఖర్చులను తట్టుకోలేని స్థితిలో ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రవేశపెట్టిన పలు పథకాలు, ..మిగతా 2లో



# రక్షణ ఇవ్వలేం

**భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే ఊరుకోవాలా?**

**కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయస్థానం**

**జనం పవర్, హైదరాబాద్ :**

అరెస్టు నుంచి తనకు రక్షణ కల్పించాలని కార్టూనిస్ట్ హేమంత్ మాలవీయలో వేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. అతడికి అరెస్టు నుంచి రక్షణ కల్పించడానికి నిరాకరించింది. కొందరు కళాకారులు, కార్టూనిస్టులు ..మిగతా 3లో



3

## ఇంట్లో అస్థిపంజరం.. నాంపల్లిలో తీవ్ర కలకలం



# కవిత, మల్లన్న వివాదం తప్పెవరిది?

- కంచం, మంచం అంటూ మల్లన్న కామెంట్స్
- తెలంగాణ కల్చర్ అంటూ సమర్థింపు
- జాగృతి కార్యకర్తల మండిపాటు...
- మీడియాపై దాడిని ఖండించిన పలువురు
- ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?

**జనం పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయ రంగంలో ఇటీవల జరిగిన ఒక సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్, ఎకెఎ తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, జాగృతి కార్యకర్తలు మల్లన్న నడుపుతున్న క్యూ న్యూస్ ..మిగతా 3లో



2

## తిరుపతి రైల్వే స్టేషన్ లో భారీ అగ్ని ప్రమాదం



# శంకరమంచి రామకృష్ణశాస్త్రికి తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం

**జనం పవర్, హైదరాబాద్ :**

శృంగేరి పీఠ ఆస్థాన జ్యోతిర్విద్వాంసులు బ్రహ్మశ్రీ డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రిని తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం వరించింది. శృంగేరి ఉభయ జగద్గురువుల అనుగ్రహంతో, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహకారంతో నిర్వహించిన తెలంగాణ విద్వత్సభ నవమ వార్షిక విద్వత్సమ్మేళనంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. పుష్పగిరి జగద్గురు మహాసంస్థానంలో (బేగంపేట) ఆదివారం ..మిగతా 2లో



2

## ఆర్థికభారం ఉన్నా పథకాలు అమలు చేస్తున్నాం



## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ విచారణకు బీఎస్పీ నేత

**జనం పవర్, హైదరాబాద్ :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు బీఎస్పీ నేత వట్టే జానయ్య హాజరయ్యారు. ఆయన వాంగ్మూలాన్ని అధికారులు రికార్డ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సూర్యాపేట నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈక్రమంలో ఎన్నికల సమయంలో వట్టే జానయ్య ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అధికారులు గుర్తించారు. దీంతో తాజాగా విచారణకు పిలిచారు.






2

## గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు

## కవితకు బీసీ వర్గాల పదజాలాలు తెలియవు

కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న




2

## ఆస్పత్రిలో దారుణం.. పేషెంట్‌పై వార్డు బాయ్ లైంగికదాడి

**జనం పవర్, హైదరాబాద్ :**

హైదరాబాద్ విద్యానగర్ లోని ఆంధ్ర మహిళా సభ ఆసుపత్రిలో దారుణం వెలుగుచూసింది. ఓ వార్డ్ బాయ్ మహిళా పేషెంట్ పై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ట్రీట్ మెంట్ కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు వార్డ్ బాయ్. అసభ్య ప్రవర్తనతో మహిళ పేషెంట్ కేకలు వేసింది. మహిళా పేషెంట్ అరుపులతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. అక్కడే ఉన్న బాధితురాలి కుటుంబ సభ్యులు వార్డ్ బాయ్ ని చితకబాదారు. అనంతరం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసభ్యంగా ప్రవర్తించిన వార్డుబాయ్ ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

- రంగంలో మాతంగి స్వర్ణలత
- రాబోయే రోజుల్లో మహమ్మారి వస్తుంది
- అగ్నిప్రమాదాలు కూడా వస్తాయన్న స్వర్ణలత

2






Contact: 96181 81112,



## శంకరమంచి రామకృష్ణశాస్త్రికి తెలంగాణ విద్వత్సభ విశిష్ట పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారి సమక్షంలో రామకృష్ణశాస్త్రిని సత్కరించారు. విద్వత్సభ అధ్యక్షులు యాయవరం చంద్రశేఖరశర్మ, ఉపాధ్యక్షులు జనగామ సిద్ధాంతి సంపత్ కుమార కృష్ణమాచారి, కార్యదర్శి దివ్యజ్ఞాన సిద్ధాంతి పర్యవేక్షణలో జరిగిన ఈ సభకు దర్శనం శర్మ సారథ్యం వహించారు. ఈ కార్యక్రమంలో వనం జ్వాలా నరసింహమూర్తి, పూర్వ కేంద్రమంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, యాదాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు లక్ష్మీ నరసింహాచార్యులు, వెంకటేశ్వర శర్మ, వెన్నంపల్లి జగన్మోహన శర్మ, సాగి కమలాకర శర్మ, గాడిచర్ల నాగేశ్వర సిద్ధాంతి, సంధ్యాలక్ష్మి తదితర ప్రముఖులు, పండితులు పాల్గొన్నారు. డాక్టర్ శంకరమంచి రామకృష్ణశాస్త్రికి ఈ విశిష్ట పురస్కారం లభించడంపై విద్యావేత్తలు, పండితులు హర్షం వ్యక్తంచేశారు.




## కవితకు బీసీ వర్గాల పదజాలాలు తెలియవు

- **కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం**
- **ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

(మొదటి పేజీ తరువాయి)

శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కలిశారు. ఆదివారం క్యూ న్యూస్ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై హత్యాయత్నం జరిగిందని, దానిపై మండలి ఛైర్మన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత అనుచరుల విధ్వంసంపై వివరించినట్లు చెప్పారు. కాసేపట్లో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ''కవితపై ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశాం. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరాం. నాకు రక్షణ కల్పించాలని మండలి ఛైర్మన్‌ను కోరాను. ఘటనపై విచారణ చేస్తామని మండలి ఛైర్మన్ హామీ ఇచ్చారు. బీసీల కట్టుబాట్లు, పదజాలం ఏమిటో కవితకు తెలియదు. బీసీల రాజకీయాన్ని నిలువరించాలనే ఉద్దేశంతోనే చర్యలకు పాల్పడుతున్నారు'' అని తీన్మార్ మల్లన్న అన్నారు.

## తిరుపతి రైల్వే స్టేషన్ లో భారీ అగ్ని ప్రమాదం

**జనం పవర్, హైదరాబాద్ :**
తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం నాడు భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లూప్‌లైన్‌లో ఆగివున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్, షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు బోగీలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఈ అగ్నిప్రమాదంతో తిరుపతి రైల్వే స్టేషన్ లో ఉన్న ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. రైల్వే అధికారులు ప్రమాద కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్టు తెలుస్తోంది.




## వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

**జనం పవర్, హైదరాబాద్ :**
సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన 'రంగం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడే భారం తనదని చెప్పారు. రాబోయే రోజుల్లో మహమ్మారి వెంటాడుతుందని, అగ్నిప్రమాదాలు కూడా సంభవిస్తాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని భక్తులను హెచ్చరించారు. ఈ ఏడాది వర్షాలు తప్పకుండా కురుస్తాయని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని తెలిపారు. ''బాలబాలికలను మీరు విచ్చలవిడిగా వదిలేస్తున్నారు.. కానీ నేను కడుపులో పెట్టుకుని కాచుకుంటున్నాను. ఈసారి చాలా సంతోషంగా పూజలు చేశారు. మీ అందరినీ సంతోషంగా సమానంగా చూస్తాను. మీ అరికాలిలో ముల్లు నాలుకతో తీస్తాను. కాలం తీరితే ఎవరు ఏది అనుభవించాలో అది అనుభవిస్తారు, నేను అడ్డురాను'' అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# రేవంత్ సర్కారుకు పథకాల భారం

- **నిధుల సమీకరణ, ఆర్థిక నిర్వహణకు ఇబ్బందులు**
- **భారీగా రుణాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ఉన్న పథకాలకు తోడు కొత్త పథకాలు అమలు చేయాల్సిన పరిస్థితి**
- **ఓటు బ్యాంకుగా మారిన కొన్ని సంక్షేమ పథకాలు**
- **వాటిని అమలు చేయలేక తప్పని పరిస్థితి**
- **ఫీజు రియింబర్స్ మెంట్ లాంటి పథకాల అమలు కష్టమే..**




(మొదటి పేజీ తరువాయి)

గతంలోని కొన్ని కీలక కార్యక్రమాలతో కలిపి రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం నిధుల సమీకరణ, ఆర్థిక నిర్వహణలో సమర్థవంతమైన విధానాలను అనుసరించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**సంక్షేమ పథకాల ఆర్థిక ఒత్తిడి**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసరా పింఛన్లు, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), మహాలక్ష్మి (రూ.500కు గ్యాస్ సిలిండర్) వంటి పథకాలు ప్రజలకు ఆర్థిక ఊరటనిచ్చినప్పటికీ, వీటి అమలుకు అవసరమైన నిధులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సవాలు చేస్తున్నాయి. 202425 బడ్జెట్‌లో రూ.2,75,890.69 కోట్ల ఖర్చులకు గాను రాష్ట్ర ఆదాయం రూ.2,74,186.71 కోట్లుగా అంచనా వేయగా, రూ.1,703.97 కోట్ల ద్రవ్యలోటు ఏర్పడిందని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. ఈ లోటును అధిగమించేందుకు రూ.68,585 కోట్ల రుణాలు సమీకరించాల్సిన అవసరం ఏర్పడింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.5,084 కోట్లు, గృహజ్యోతి పథకానికి భారీ నిధులు, రైతు భరోసా కింద ఎకరానికి రూ.5,000 ఆర్థిక సాయం, ఆసరా పింఛన్ల కోసం రూ.4,693 కోట్లు కేటాయించినప్పటికీ, నిధుల కొరత, అమలులో ఆలస్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 80.54 లక్షల దరఖాస్తులు రాగా, వీటి నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ సవాలుగా మారింది.

**ఆర్థిక సవాళ్ల నేపథ్యం**

రాష్ట్ర ఆదాయం పన్నులు, పన్నేతర ఆదాయం, కేంద్ర గ్రాంట్లు, రుణాల ద్వారా సమకూరుతుంది. అయితే, ఖర్చులు ఆదాయం కంటే 39.75% ఎక్కువగా ఉండటంతో ఆర్థిక స్థిరత్వం సవాలుగా మారింది. రాష్ట్ర తలసరి ఆదాయం గతంలో దేశంలో మొదటి స్థానంలో ఉండగా, ప్రస్తుతం 11వ స్థానానికి, స్థూల రాష్ట్ర ఉత్పత్తి (GSDP) వృద్ధి 14వ స్థానానికి పడిపోయినట్లు ఒక ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొత్త పథకాల అమలుకు అవకాశం లేకుండా చేస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించినప్పటికీ, వాస్తవ ఖర్చు తక్కువగా ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆదాయాన్ని వాస్తవికంగా అంచనా వేసినప్పటికీ, ఆర్థిక ఒత్తిడి తప్పడం లేదని అధికార వర్గాలు తెలిపాయి. రైతు బంధు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలు పూర్తిగా నెరవేర్చకపోవడంపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.

**నిధుల సమీకరణకు పరిష్కార మార్గాలు**

ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కొన్ని కీలక చర్యలు చేపట్టాలి. పన్ను ఆదాయం పెంపు: రిజిస్ట్రేషన్, స్టాంపు రుసుములు, వాణిజ్య పన్నుల వసూళ్లలో సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా ఆదాయాన్ని పెంచవచ్చు. రియల్ ఎస్టేట్, ఖనిజ వనరుల నుంచి పన్నేతర ఆదాయాన్ని గణనీయంగా ఆర్జించే అవకాశం ఉంది. కేంద్ర నిధుల వినియోగం: కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, 14వ ఆర్థిక సంఘం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి. గతంలో రూ.2,376 కోట్లు అందుబాటులోకి వచ్చినట్లు రిపోర్టులు సూచిస్తున్నాయి. ఈ నిధులను గ్రామీణాభివృద్ధి, సాగునీటి రంగాలకు కేటాయించడం ద్వారా ఆర్థిక ఒత్తిడిని తగ్గించవచ్చు. లబ్ధిదారుల గుర్తింపు: సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఖచ్చితంగా గుర్తించడం ద్వారా నిధుల వృథాను నివారించవచ్చు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా 101.83 లక్షల కుటుంబాలను గుర్తించిన అనుభవం ఉంది. ఇలాంటి సర్వేలను కొనసాగించడం ద్వారా అనవసర ఖర్చులను తగ్గించవచ్చు. ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ: ఐటీ, ఫార్మా, జీవిశాస్త్ర రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వృద్ధిని సాధించవచ్చు. టీఎస్ ఐపాస్ వంటి విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రం గతంలో టాప్3 రాష్ట్రాల్లో నిలిచిన స్థానాన్ని తిరిగి సాధించవచ్చు.

**ఆశావాద దిశగా అడుగులు**

తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నంలో ఉన్నప్పటికీ, ఆర్థిక స్థిరత్వం సాధించడం అత్యవసరం. పన్ను వసూళ్ల సామర్థ్యం, కేంద్ర నిధుల సమర్థవంతమైన వినియోగం, ప్రైవేట్ పెట్టుబడుల ఆకర్షణ, లబ్ధిదారుల ఖచ్చితమైన గుర్తింపు వంటి చర్యల ద్వారా రాష్ట్రం ఈ ఆర్థిక సవాళ్లను అధిగమించగలదు. ఈ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా, ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతూనే, రాష్ట్ర ఆర్థిక వృద్ధిని సాధించి, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలపడానికి ప్రభుత్వం ముందుకు సాగాలి. సమతుల్య ఆర్థిక విధానాలు, పారదర్శక నిర్వహణతో ప్రజల విశ్వాసాన్ని చూరగొని, తెలంగాణ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో నూతన శిఖరాలను అధిరోహించగలదని ప్రజలు, నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్థికభారం ఉన్నా పథకాలు అమలు చేస్తున్నాం

**జనం పవర్, హైదరాబాద్ :**
ఖమ్మంలోని పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. సాగర్ ఆయకట్టు కింద 2.5 లక్షల ఎకరాలకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. రాబోయే 5 రోజుల్లో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని చెప్పారు. కృష్ణా బేసిన్‌లో పంటలకు ఇబ్బంది లేకుండా నీరు అందిస్తామన్నారు. ''ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా రైతు పథకాలు అమలు చేస్తున్నాం. రైతు భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రూ.12 వేలు అందించాం. వారి ఖాతాల్లో 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు జమ చేశాం. సన్నధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రాబోయే రోజుల్లో మిగిలిన పంటలకు కూడా ఇస్తాం'' అని పొంగులేటి తెలిపారు.






## ఇంట్లో అస్థిపంజరం.. నాంపల్లిలో తీవ్ర కలకలం

**జనం పవర్, హైదరాబాద్ :**
నగరంలోని ఓ ఇంట్లో మనిషి అస్థిపంజరం ఉండటం కలకలం రేపింది. హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలోని నాంపల్లి మార్కెట్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఏడేళ్లుగా ఆ ఇంటిలో ఎవరూ లేరని.. యజమాని విదేశాల్లో ఉన్నారని స్థానికులు తెలిపారు. అస్థిపంజరం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్ అక్కడికి చేరుకుని ఆధారాలు సేకరించింది.
ఇటీవల ఓ యువకుడు శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటిలోకి వెళ్లినట్లు సమాచారం. లోపల అస్థిపంజరాన్ని వీడియోలో రికార్డు చేశాడని.. అది వైరల్ కావడంతో యువకుడిని పోలీసులు విచారించినట్లు తెలిసింది. క్రికెట్ బాల్ ఆ ఇంట్లో పడటంతో తీసుకునేందుకు వెళ్లానని యువకుడు తెలిపినట్లు సమాచారం.

# గోవా గవర్నర్ గా అశోక గజపతిరాజు



**జనం పవర్, హైదరాబాద్ :**
మూడు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నియమించారు. గోవా గవర్నర్‌గా టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు నియమితులయ్యారు. హరియాణా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషిమ్‌కుమార్ ఘోష్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాను నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా ప్రజలకు, రాష్ట్ర రాజకీయ వర్గాలకు పరిచయం అక్కర్లేని పేరు పూసపాటి అశోక్ గజపతిరాజు. విజయనగర సంస్థానాధీశుల వారసుడే అయినప్పటికీ రాచరికపు పోకడలకు దూరంగా ఉంటూ సిసలైన ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారు. నీతి, నిజాయతీలకు నిలువుటద్దంగా నిలిచారు. నమ్మిన సిద్ధాంతాలకు తుది దాకా కట్టుబడే నైజం. విజయనగరం మహారాజు అయిన డాక్టర్ పీవీజీ రాజు కుమారుడైన అశోక్ గజపతి రాజు జిల్లా ప్రజలకు రాజుగారిగా చిరపరిచితులు. జిల్లా టీడీపీ శ్రేణులు ఆయనను పెద్దాయనగా గౌరవించి ఆ పేరుతోనే సంబోధిస్తుంటారు. అశోక్ గజపతిరాజు 1951 జూన్ 26న జన్మించారు. గ్వాలియర్‌లోని సింధియా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, విశాఖలోని ప్రభుత్వ కృష్ణా కళాశాలలో ఆయన చదువుకున్నారు. పుట్టింది రాజవంశంలోనే అయినా సామ్యవాద భావాలను ఆయన చిన్నప్పటి నుంచే పుణికి పుచ్చుకున్నారు. విద్యార్థి దశలో కూడా ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో ఆయన ప్రముఖ పాత్ర పోషించారు. ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వ దమన కాండను నిరసిస్తూ ఆయన ప్రత్యక్ష రాజకీయ అరంగేట్రానికి తెరతీశారు.

**కేంద్రం మంత్రిగా ఎదిగి..**

జయప్రకాశ్ నారాయణ, జార్జ్ ఫెర్నాండెజ్, చంద్రశేఖర్ వంటి సోషలిస్టు నాయకుల ఉపన్యాసాలకు ఎక్కువగా ప్రభావితమయ్యారు. 1978లో మొట్టమొదటిసారిగా జనతా పార్టీ తరపున విజయనగరం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన అశోక్ గజపతిరాజు 1982లో ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరారు. నాటి నుంచి ఆ పార్టీలో కీలక సభ్యుడిగా కొనసాగారు. ఆ పార్టీ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా విజయం సాధించారు. 1983, 1985, 1989, 1994, 1999, 2009లో తెదేపా తరపున గెలిచారు. 2014లో అదే పార్టీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి జయకేతనం ఎగురవేశారు. 2014లో కేంద్ర ప్రభుత్వంలో పౌరవిమానయానశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు మంజూరు విషయంలో కీలకంగా వ్యవహరించారు. ఈయన సతీమణి సునీలా గజపతిరాజు విజయనగరం మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలందించారు. అశోక్ గజపతిరాజుకు అదితి గజపతిరాజు, విద్యా గజపతిరాజు అనే ఇద్దరు కుమార్తెలున్నారు. టీడీపీ హయాంలో అశోక్ గజపతిరాజు ఎక్సైజ్, వాణిజ్య, ఆర్థిక, రెవెన్యూ, శాస నసభా వ్యవహారాల శాఖల మంత్రిగా 13 ఏళ్లపాటు సేవలందించారు.

**ముక్కుసూటి తనం..**

పైరవీలనే పదం ఆయన నిఘంటువులో కనిపించదు. తప్పు చేసిన వారు తనవారైనా సమర్థించే ప్రసక్తే లేదు. ముక్కుసూటి తనం వల్ల అప్పుడప్పుడూ ఇబ్బందులు ఎదురవుతున్నా ఆయన బాణీ మార్చుకునే అవకాశమే ఉండదు. అశోక్ గజపతిరాజుకు క్రీడలంటే చాలా ఇష్టం. ఒక దఫా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఆయన తన పనులను తానే చేసుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. రోజూ ఉదయం తన కారును తానే తుడుచుకుంటారు. మొక్కలకు నీళ్లు పెట్టడం ఆయన దినచర్యల్లో ఒక భాగం. చివరకు తన పాదరక్షలను కూడా తానే శుభ్రం చేసుకుంటారు.

**విమర్శలు శాస్త్రీయంగా..**

పాదాభివందనాలకు ఆయన ఆమడదూరంలో ఉంటారు. పొగడ్తలను కూడా సహించరు. కష్టపడని వారిని చూస్తే క్లాసు తీసుకుంటారు. ప్రస్తుత రాజకీయ నాయకులు పొరపాటు నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఆయన విమర్శించే తీరు శాస్త్రీయంగా ఉండటం విశేషం. తనపై వచ్చే విమర్శలను కూడా ఆయన హుందాగా స్వీకరించి సరిదిద్దుకోవడం ఆయనలోని ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రస్తుతం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఆయన కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో అశోక్‌గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు విజయనగరం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



## సైబర్ మోసం.. రిఫండ్ చేస్తామని వృద్ధురాలి నుంచి డబ్బు కొట్టేశారు

**జనం పవర్, హైదరాబాద్ :**

అమెజాన్‌లో కొనుగోలు చేసిన వస్తువును రిటర్న్ చేయాలని ప్రయత్నించిన ఓ వృద్ధురాలిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఆమె నుంచి రూ.1.07లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్‌కు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలు ఇటీవల అమెజాన్‌లో ఓ వస్తువుని కొనుగోలు చేశారు. దాన్ని రిటర్న్ చేసి రిఫండ్ తీసుకోవాలని కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు ఆమెకు ఫోన్ చేసి రిఫండ్ చేస్తామని నమ్మించారు. స్క్రీన్ షేరింగ్ యాప్ డౌన్‌లోడ్ చేయించి బాధితురాలి మొబైల్‌ను అధీనంలోకి తీసుకున్నారు. రిఫండ్ కావట్లేదని, బ్యాంకు వివరాలు ఇవ్వాలని కోరడంతో వారికి ఆమె తన ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇచ్చారు. వెంటనే ఆ రెండు బ్యాంక్ ఖాతాల్లోంచి రూ.1.07లక్షలు డెబిట్ అయ్యాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు.. హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## తెలంగాణలో నేడు నూతన రేషన్‌కార్డుల పంపిణీ

**జనం పవర్, హైదరాబాద్ :**

రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్ల నుంచి నూతన రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల కల నెరవేరబోతోంది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి సీఎం 11 మంది లబ్ధిదారులకు కార్డులు అందిస్తారు. అనంతరం బహిరంగసభకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సీఎం కార్డులు పంపిణీ చేయగానే రాష్ట్రవ్యాప్తంగా 3.58 లక్షల కార్డులు ఆయా లబ్ధిదారుల చేతికందనున్నాయి. నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ కార్డుల పంపిణీ, సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 80 వేల మందితో బహిరంగసభను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## రక్షణ ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

, స్టాండప్ కమెడియన్‌లు ఈ మధ్య భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై గతంలో కేసు నమోదయ్యింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలంటూ ఆయన వేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణ జులై 15కు వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ప్రధాని నరేంద్రమోదీ, ఆరెస్సెస్‌పై వేసిన కార్టూన్ అభ్యంతరకరంగా ఉండటంతో కార్టూనిస్టు హేమంత్ మాలవీయపై కేసు నమోదయ్యింది. మధ్యప్రదేశ్ హైకోర్టులో అతడు ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా..జులై 3న పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కార్టూన్ గీయడంలో ఆయన విచక్షణ లేకుండా ప్రవర్తించాడని పేర్కొంటూ.. దానిని తోసిపుచ్చింది. దీంతో మాలవీయ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

**'నిమిష' విషయంలో భారత్ చేయగలిగిందేమీ లేదు: సుప్రీంకు కేంద్రం వెల్లడి**

దేశంలో కొవిడ్ ప్రభావం ఎక్కువగా ఉన్న సమయంలో ఈ కార్టూన్ ప్రచురితమయ్యిందని హేమంత్ మాలవీయ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఆ సమయంలో వ్యాక్సిన్ భద్రతపై వచ్చిన తప్పుడు సమాచారం, ప్రజల ఆందోళనల నేపథ్యంలో ఒక రాజకీయ నాయకుడు, పౌరుడికి టీకాలు వేస్తున్నట్లు వ్యంగ్య చిత్రాన్ని గీసినట్లు పేర్కొన్నారు. ఇందులో ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.





# కవిత, మల్లన్న వివాదం తప్పెవరిది?

- **కంచం, మంచం అంటూ మల్లన్న కామెంట్స్**
- **తెలంగాణ కల్చర్ అంటూ సమర్థింపు**
- **జాగృతి కార్యకర్తల మండిపాటు...**
- **మీడియాపై దాడిని ఖండించిన పలువురు**
- **ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?**

(మొదటి పేజీ తరువాయి)





కార్యాలయంపై దాడి చేశారు, ఇది రాజకీయ ఉద్రిక్తతను మరింత పెంచింది. ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడం, ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదులు సమర్పించడం వంటి పరిణామాలు ఈ ఘటనను మరింత సంక్లిష్టంగా మార్చాయి.

తెలంగాణ రాజకీయ రంగంలో ఇటీవల జరిగిన ఒక సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్, ఎకెఎ తీన్మార్ మల్లన్న, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఈ వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచాయి. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, జాగృతి కార్యకర్తలు మల్లన్న నడుపుతున్న క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేశారు, ఇది రాజకీయ ఉద్రిక్తతను మరింత పెంచింది. ఇరు పక్షాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేయడం, ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదులు సమర్పించడం వంటి పరిణామాలు ఈ ఘటనను మరింత సంక్లిష్టంగా మార్చాయి.

**తీన్మార్ మల్లన్న ఆరోపణలు**

సంగారెడ్డి జిల్లా ఝురాసంగంలో జరిగిన ఒక బహిరంగ సమావేశంలో తీన్మార్ మల్లన్న, కవిత చేపట్టిన బీసీ ఉద్యమంపై తీవ్ర విమర్శలు చేశారు. "బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వస్తే కవిత పండగ చేసుకోవడం ఏంటి? బీసీలతో కవితకు కంచం పొత్తు ఉందా, మంచం పొత్తు ఉందా?" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు మహిళా ఎమ్మెల్సీ అయిన కవిత గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, సమాజంలో సామాన్య మహిళల పట్ల అగౌరవ ధోరణిని ప్రతిబింబిస్తాయని కవిత ఆరోపించారు.

మల్లన్న వాడిన "కంచంమంచం" అనే పదజాలం తెలంగాణ సామాజిక సందర్భంలో ఊతపదంగా ఉపయోగించబడినప్పటికీ, ఒక మహిళా ప్రజాప్రతినిధిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, జాగృతి కార్యకర్తలు మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేసి, అక్కడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు.

**క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి**

మేడిపల్లిలోని క్యూ న్యూస్ కార్యాలయంపై జాగృతి కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో కార్యాలయంలోని ఫర్నిచర్, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంలో మల్లన్న గన్‌మెన్ గాల్లోకి ఐదు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం, దీనితో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. ఈ దాడిలో పలువురికి గాయాలు కూడా అయినట్లు తెలుస్తోంది.

కవిత ఈ దాడిని సమర్థిస్తూ, మల్లన్న వ్యాఖ్యలు తనను మరియు జాగృతి కార్యకర్తలను కాల్పులకు ఉసిగొల్పేలా ఉన్నాయని ఆరోపించారు. ఆమె తెలంగాణ డీజీపీకి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదులు చేసి, మల్లన్నను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

**ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు**

కవిత తన ఫిర్యాదులో, మల్లన్న వ్యాఖ్యలు శాసనమండలి సభ్యురాలిగా తన గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, రాజకీయాల్లో మహిళల ప్రవేశాన్ని నిరుత్సాహపరిచేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను శాసనమండలి ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని, 262c సబ్ రూల్ 1 కింద చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు, తీన్మార్ మల్లన్న కవిత మరియు ఆమె కుటుంబం తనపై హత్యాయత్నం చేశారని ఆరోపిస్తూ, మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె అనుచరులు సుమారు 50 మంది మారణాయుధాలతో తనపై దాడి చేశారని పేర్కొన్నారు.

**ఇరు పక్షాల ఆరోపణలు**

తీన్మార్ మల్లన్న తన వ్యాఖ్యలలో ఎటువంటి తప్పు లేదని, బీసీ ఉద్యమంతో కవితకు సంబంధం లేదని పునరుద్ఘాటించారు. జాగృతి కార్యకర్తల దాడిని ఖండిస్తూ, కవిత మరియు ఆమె కుటుంబం తనపై హత్యాయత్నం చేశారని ఆరోపించారు. ఈ దాడులతో బీసీ ఉద్యమం ఆగిపోదని, మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

మరోవైపు, కవిత తన ఫిర్యాదులో, మల్లన్న వ్యాఖ్యలు తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసినట్లు, జాగృతి కార్యకర్తలపై కాల్పులకు ఉసిగొల్పేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ ఘటనలో ప్రభుత్వ పాత్రను కూడా ఆమె ప్రశ్నించారు, డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తూ, సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**విశ్లేషణ**

ఈ వివాదాన్ని రాజకీయ, సామాజిక, మరియు లింగ సమానత్వ కోణాల నుంచి పరిశీలించవచ్చు.

రాజకీయ కోణం: ఈ ఘటన బీఆర్‌ఎస్ మరియు కాంగ్రెస్ మధ్య రాజకీయ శత్రుత్వాన్ని మరింత ఉధృతం చేసింది. కవిత బీసీ ఉద్యమాన్ని చేపట్టడం, దాన్ని మల్లన్న తప్పుబట్టడం వెనుక రాజకీయ లబ్ధి కోసం పోటీ ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మల్లన్న కొత్త రాజకీయ పార్టీ స్థాపన ప్రకటన కూడా ఈ వివాదానికి మరో కోణాన్ని జోడించింది.

సామాజిక కోణం: బీసీ రిజర్వేషన్లపై కవిత చేపట్టిన ఉద్యమం సామాజిక న్యాయం కోసం ఒక ప్రయత్నంగా కనిపిస్తుంది. అయితే, మల్లన్న ఈ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించడం వల్ల బీసీ సామాజిక వర్గాల మధ్య చర్చ మరింత తీవ్రమైంది. ఈ వివాదం బీసీ ఉద్యమంపై ప్రజల దృష్టిని మళ్లించే అవకాశం ఉంది.

లింగ సమానత్వ కోణం: మల్లన్న వ్యాఖ్యలు మహిళా ప్రజాప్రతినిధిపై అనుచితంగా ఉన్నాయని, రాజకీయాల్లో మహిళలను నిరుత్సాహపరిచేలా ఉన్నాయని కవిత ఆరోపించారు. ఈ ఆరోపణలు రాజకీయాల్లో లింగ సమానత్వం మరియు మహిళల గౌరవం గురించి మరోసారి చర్చను రేకెత్తించాయి. మల్లన్న వ్యాఖ్యలు సామాజిక మీడియాలో విస్తృతంగా ఖండించబడ్డాయి, ముఖ్యంగా మహిళా సంఘాలు మరియు సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి.

**సమాజంపై ప్రభావం**

ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన చర్చను రేకెత్తించింది. ఒకవైపు, బీసీ రిజర్వేషన్లు మరియు సామాజిక న్యాయం గురించి చర్చకు దారితీసినప్పటికీ, మరోవైపు అనుచిత వ్యాఖ్యలు మరియు హింసాత్మక ఘటనలు రాజకీయ సంస్కృతిపై ప్రశ్నలను లేవనెత్తాయి. ఈ ఘటన రాజకీయ నాయకులు తమ వ్యాఖ్యలలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది.

**ఎథిక్స్ కమిటీ ఏం తేలుస్తుంది?**


తీన్మార్ మల్లన్న మరియు కవిత మధ్య వివాదం తెలంగాణ రాజకీయాల్లో ఒక సంచలనాత్మక ఘటనగా మిగిలిపోతుంది. ఈ ఘటనలో ఇరు పక్షాల ఆరోపణలు, ఫిర్యాదులు, మరియు హింసాత్మక దాడులు రాజకీయ, సామాజిక, లింగ సమానత్వ కోణాలను తెరపైకి తెచ్చాయి. ఎథిక్స్ కమిటీ మరియు పోలీస్ విచారణల ఫలితాలు ఈ వివాదంపై తదుపరి నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి. ఈ ఘటన రాజకీయ నాయకులకు సమాజంపై తమ మాటలు చర్యల ప్రభావాన్ని గుర్తు చేస్తుంది.

## డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యం: రామచందర్‌రావు

**జనం పవర్, హైదరాబాద్ :**



తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు విజయ సంకల్పం తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా చౌటుప్పల్‌కు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. ''భాజపా ప్రభుత్వం మాత్రమే తెలంగాణలో స్వర్ణయుగం తెస్తుంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మాత్రమే తెలంగాణ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. గత భారాస ప్రభుత్వం అవినీతిమయమైంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజల్ని ఇబ్బందులు పెడుతోంది. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా భాజపా వైపు చూస్తున్నారు'' అని రామచందర్‌రావు అన్నారు.



## అవకాశాల కోసం నేనెప్పుడూ పరిగెత్తలేదు: అశోక్‌గజపతిరాజు

**జనం పవర్, హైదరాబాద్ :**

అవకాశాల కోసం తానెప్పుడూ పరిగెత్తలేదని తెదేపా సీనియర్ నేత, కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు అన్నారు. అవకాశాలు వచ్చిప్పుడు బాధ్యతగా స్వీకరించానని చెప్పారు. గవర్నర్‌గా తన పేరును సీఎం చంద్రబాబు సిఫార్సు చేయడం ఆనందంగా ఉందన్నారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిని నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయనగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఈ నియామకంతో తెలుగువారి గౌరవాన్ని మరింత పెంచే బాధ్యత నాపై ఉంది. ఓటమితో నిరుత్సాహ పడనక్కర్లేదు.. దాని నుంచి పాఠాలు నేర్చుకుని మరింత ఉన్నతంగా ముందుకు వెళ్లొచ్చు. గోవా అంటే ప్రియ మిత్రుడు మనోహర్ పారికర్ గుర్తొస్తారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌లో అమ్మాయిలకూ చదివే అవకాశం కల్పించాలని ఆయన రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు కోరాను. దేశానికి సేవ చేసే అవకాశం మరోసారి లభించడం ఆనందంగా ఉంది. అభినందనలు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని అశోక్ గజపతిరాజు అన్నారు.

## రేషన్ కార్డు.. పేదవాడి ఆత్మగౌరవం: సీఎం రేవంత్ రెడ్డి

**జనం పవర్, హైదరాబాద్ :**



రేషన్ కార్డు పేదవాడి ఆత్మగౌరవం.. గుర్తింపు.. ఆకలి తీర్చే ఆయుధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి (Revanth Reddy) అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నల్గొండ చరిత్రే.. తెలంగాణ చరిత్ర అంటే అతిశయోక్తి కాదన్నారు. ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి నేతలపై సీఎం విమర్శలు చేశారు. ''పదేళ్లు అధికారంలో ఉన్నా పేదలకు రేషన్ కార్డు, సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన భారత రాష్ట్ర సమితి నేతలకు రాలేదు. మా ప్రభుత్వం 3.10 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తే రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇచ్చాం. దేశం తలెత్తుకునేలా వరి ధాన్యం ఉత్పత్తి చేస్తున్నాం. ప్రతిపక్ష పార్టీ నేతలు అధికారంలో ఉన్నప్పుడు గోదావరి నీళ్లు ఇవ్వలేదు.. ఇప్పుడు సీఎం వస్తే అడ్డుకుంటామంటున్నారు. గతంలో 3 రోజులు అవకాశమిస్తే తుంగతుర్తికి జలాలు తెస్తామన్నారు. పదేళ్లు అవకాశం ఇచ్చినా దేవాదుల నుంచి నీళ్లు తేలేదు'' అని రేవంత్ విమర్శించారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి





## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** జిల్లాలో పలు ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతుల వంటి అభివృద్ధి పనులపై ఎంపిడివోలు దృష్టి సారించాలని,క్షేత్రస్థాయిలో సందర్శించి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి జిల్లా అధికారులు, ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్లతో సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వివిధ పథకాల ద్వారా మంజూరైన నిధులతో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని అన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతుల కల్పన, కిచెన్ షెడ్ టాయిలెట్, ప్రహరీ గోడ వంటివి పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి పనినీ పర్యవేక్షించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న పలు ప్రభుత్వ భవనాలు కమ్యూనిటీ హాళ్లలో మరమ్మతులు చేపడుతున్నామని, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, జిల్లా సంక్షేమ అధికారి ఈ పనులను పర్యవేక్షిస్తూ త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పెండింగ్ కోర్టు కేసులపై దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు కౌంటర్ దాఖలు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని అర్హులైన లబ్ధిదారులు ఉంటే తదుపరి జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు పట్ల రైతులకు విస్తృత అవగాహన కల్పించా లని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ప్రైవేట్ అంబులెన్స్‌లను ప్రభుత్వ ఆసుపత్రులకు అతి సమీపంలో నిలుపుతున్నారని, ఈ విధానాన్ని కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మహేశ్వర్, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

**ప్రజావాణికి 339 దరఖాస్తులు...**


"ప్రజావాణి"లో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 339 అర్జీలు రాగా పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



**జనం పవర్, మాడుగులపల్లి, జూలై 14:** నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన కందుల యాదమ్మకు 1,60,000, జోలం స్వప్నకు 27,000 రూపాయలు ప్రభుత్వ సీఎం సహాయ నిధుల నుండి మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందచేశారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి(బిఎల్ఆర్) ఆదేశాలతో సోమవారం గ్రామంలో లబ్దిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ గ్రామ నాయకులు పంపిణీ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయ అనేది గొప్ప వరం లాంటిదని ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించుకొని ఇబ్బంది పడుతున్న పేద ప్రజలకు ఎంతో సహాయపడుతుందని అన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు




**జనం పవర్, మాడుగులపల్లి, జూలై 14:** తిరుమలగిరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేషన్ కార్డుల పంపిణీలో బాగంగా భారీ బహిరంగసభ సందర్భంగా నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల మండల బీఆర్ఎస్ నాయకులను మాడుగులపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు ఎందుకింత భయం ప్రజల పక్షాన ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం ఏంటి అని ప్రశ్నించారు. మనం ఎక్కడ ఉన్నాం ప్రజాస్వామ్యంలో ఉన్నా మా అని మండిపడ్డారు. అరెస్ట్ అయినవారిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు పుల్లెంల ఏడుకొండలు, మాజీ ఉప సర్పంచ్ చల్లా సైదిరెడ్డి, నేలపట్ల లక్ష్మయ్య ,మేడం అంజయ్య, పుల్లెంల సర్వయ్య నేలపట్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం

## బీసీ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్

**జనం పవర్, మిర్యాలగూడ, జూలై 14:** హైదరాబాద్‌లోని మేడిపల్లిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ ఆఫీసుపై దాడి చేసిన జాగృతి కార్యకర్తలు ఎమ్మెల్సీ కవిత అనుచరుల మీద తక్షణమే పోలీస్ కఠినమైన చర్యలు తీసుకోవాలని బీసీ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్ సోమవారం డిమాండ్ చేశారు. క్యూ న్యూస్ ఆఫీసుపై జాగృతి కార్యకర్తలు దాడి చేయడమే కాకుండా అక్కడ ఉన్నటువంటి సిబ్బందిని భయ భ్రాంతులకు గురిచేశారని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై దాడి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల గొంతుక అయిన తీన్మార్ మల్లన్నపై దాడి చేయడం అంటే 2 కోట్ల మంది బీసీల మీద దాడి చేయడమేనని అన్నారు. వెంటనే భేషరతుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మల్లన్నకు క్షమాపణ చెప్పాలని అన్నారు.

# ప్రభుత్వ భూములను రక్షించాలి



**జనం పవర్, మంథని, జూలై 14:** భూభారతిలో ప్రభుత్వ భూములను రక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మంథని రెవెన్యూ డివిజనల్ అధి కారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూభారతిలో భూ కబ్జాదారులు అక్రమార్కులు ప్రభుత్వ భూములకు పట్టాల కొరకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు మా దృష్టికి వచ్చిందని అన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని రెవెన్యూ ఆబాది, మున్సిపాలిటీకి సంబంధించిన భూములు ఆక్రమణకు గు రయ్యాయి అని అన్నారు.మంథని నియోజకవర్గం లోని ఇతర మండలాలు, గ్రామాలలో ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, బంజరు భూములు, దేవాదాయ భూములు, గైరాన్ భూములు, అసైన్డ్ భూము లు, ఇనాం భూములు, చెరువు, ఎస్సీకార్పొ రేష న్ భూములు, చెరువు శిఖం భూములను కొం తమంది కబ్జాదారులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి పట్టాల కోసం భూభారతిలో దరఖాస్తులు పెట్టుకున్నారన్నారు. అలాంటి దరఖాస్తులను క్షుణ్ణంగా పరి శీలన చేసి పట్టాలు చేయకుండా ప్రభుత్వ భూ ములను రక్షించాలని కోరారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబు రవి ఉన్నారు.

# రైల్వేస్టేషన్‌ను సందర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



**జనం పవర్, జమ్మికుంట, జూలై 14:** జమ్మికుంట రైల్వేస్టేషన్‌లోని సమస్యలను కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళతానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక బీజేపీ శ్రేణులతో కలిసి స్థానిక రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ అధికారులతో మాట్లాడి సమస్యలు, ప్రయాణికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట రైల్వే స్టేషన్ ప్రయాణికులు, సరకు రవాణా రాకపోకలకు ఎంతో కీలకమైందన్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఈ రైల్వేస్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయించాలనే లక్ష్యంతో ఉన్నారని తెలిపారు. అమృత్ భారత్‌లో భాగంగా దీనిని ఆధునికరించడానికి తగిన కృషి చేస్తున్నారని తెలిపారు. జమ్మికుంట ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే విషయంలో, ముఖ్యమైన పలు రైళ్లు ఇక్కడి రైల్వేస్టేషన్లో హాల్టింగ్ అయ్యే విధంగా కేంద్రమంత్రి చర్యలు తీసుకున్నారని వివరించారు. ఈకార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సంపత్‌రావు, హుజూరాబాద్ పట్టణ అధ్యక్షుడు తుర్పాటి రాజు, కమలాపూర్ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జీడి మల్లేష్, శీలం శ్రీనివాస్, రమారెడ్డి, రాజేష్ ఠాకూర్, పల్లపు రవి, కైలాసకొటి గణేష్, ఎదులాపురం అశోక్, బచ్చు శివన్న, మోతె స్వామి, కొండ్లె నగేష్, యాంసాని సమ్మయ్య, ఇటుకాల స్వరూప, రాకేష్ ఠాకూర్, నిరుపరాణి, కేస స్వరూప, బల్సుకూరి రాజేష్, ఉడుగుల రవి, కొమ్ము అశోక్, పోడెటి అనిల్, రామస్వామి, రాచపల్లి ప్రశాంత్, శ్రీవర్ధి అఖిల్, ఉడుగుల మహేందర్, మురికి మహేష్, మేక సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్నపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై బీసీ సంఘాలు, జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ మహిళ విభాగాల అధ్వర్యంలో సోమవారం ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా బీసీ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్రె పావని రవి మాట్లాడుతూ ఒక మహిళ ఆత్మగౌరవందెబ్బతీసే విధంగా చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతకాలంగా ఎమ్మెల్సీ కవిత బీసీల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చి 42% శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ఆర్డినెన్స్ తీసుకు వచ్చిందన్నారు. ఈ అంశంపై స్పందిం చిన తీన్మార్ మల్లన్న సభ్య సమాజం తలదించుకునే విధంగా, మహిళ లోకాన్ని అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ఒక మహిళ ప్రజాప్రతినిధి గౌరవా నికి భంగం కలిగించే విధంగా తీన్మార్ మల్లన్నపైన చట్టప రమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ, ప్రజా సంఘాల నాయకులు గంటల రేణుక,సుజాత, పాదం అజంత, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్య క్షుడు గుంజపడుగు హరిప్రసాద్, నాయకులు గొట్టం మ హేష్, పూసాల రణధీర్, మడిపెల్లి వినీత్‌లు పాల్గొన్నారు.

# మెగా ఉచిత వైద్యశిబిరానికి భారీ స్పందన



**జనం పవర్, మంథని, జూలై 14:** మంథని మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో దికొండ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ వైద్య ఫౌండేషన్ సహకారంతో గ్రామస్తులకు షుగర్, బీపీ రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. అలాగే కరీంనగర్ సన్ రైస్ ఆసుపత్రి వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఉచితంగా గుండె పరీక్షలు, మంథనిలోని పటేల్ ఐ కేర్ ఆస్పత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. నిరుపేద ప్రజల ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న, శ్రీ వైద్యఫౌండేషన్, అలాగే సన్ రైస్ ఆసుపత్రి యాజమాన్యానికి దికొండ లక్ష్మణ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వైద్య ఫౌండేషన్ చైర్మన్ బుద్ధార్తి సతీష్ కుమార్ దికొండ లక్ష్మణ్, సన్ రైస్ ఆసుపత్రి ఆసుపత్రి, మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్ మార్కెటింగ్, ఎక్స్యూటివ్ తిరుపతి, డాక్టర్ వెంకటేష్, ఆసుపత్రి మార్కెటింగ్ కో ఆర్డినేటర్స్ సతీష్, ఫార్మ సిస్ట్ నర్సింగ్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# 'అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలి'

**చిగురుమామిడి, జూలై 14:** నవాబుపేట వాగులో నుండి అక్రమంగా ఇసుక తరలించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు పచ్చిమట్ల అజయ్ కుమార్,టిఆర్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి,చిగురుమామిడి మండల కాంగ్రెస్ నాయకుడు బోయిని వంశీ కృష్ణ సోమవారం చిగురుమామిడి తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ స్వరూప రాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవాబుపేట కరీంనగర్ జిల్లా సరిహద్దు చివరి గ్రామం కావడంతో యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా మారుతుందన్నారు. హద్దులు కేటాయించి అక్రమ ఇసుక రవాణాను ,ప్రకృతి సంపదలను రక్షించాలని కోరారు. ఈ సందర్భంగా వారి వెంట బోయిని హరీష్,మర్రి ఐలేష్ తదితరులున్నారు.

# నగునూరు విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామంలో పదో తరగతి చదువు తున్న 72 మంది విద్యార్థులకు సోమవారం మోడీ కానుక పేరుతో సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి కాసులరవీందర్ అధ్యక్షత వహించగా, మండల అభివృద్ధి అధికారి సంజీవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడిశెట్టి సంతోష్ కుమార్, పాఠశాల ఇన్చార్జి తిరుపతిరావు గ్రామ కార్యదర్శి లక్ష్మణ్, రమణారెడ్డి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లు అందించడం వారి ఉన్నతికి దోహదపడుతుందని వక్తలు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి ఈ నిర్ణయం ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలకు నిత్యం దూరం ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సమయం ఆదా అవుతుందన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండిసంజ య్ కుమార్‌కు ధన్యవాదాలు తెలియ జేశారు. తమ పిల్లలకు సైకిళ్లు పంపిణీ చేసిన కేంద్ర మంత్రికి వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్, దేవేందర్ రాఘవేందర్, దీపక్ తేజ మహేందర్, శ్రీనివాస్‌రాజు శేఖర్‌సంతోష్ వినయ్ అజయ్ మోహన్ రెడ్డి హరి కృష్ణ, శ్రీని వాస్ గణేష్ అభిలాష్ అప్రోచ్, అరవింద్ సంజయ్ మునిందర్ సాయి విశాల్‌విక్రమ్, విద్యాసాగర్, ఆనంద్‌అసద్‌లు పాల్గొన్నారు.

# వేములవాడలో బ్రిడ్జికి ఇరువైపులా భూసేకరణ

- నిర్వాసితుల 30 ఇళ్ల కూల్చివేత..
- బాధిత కుటుంబాలు ఆందోళన, నిరసన, ఆగ్రహం

**వేములవాడ, జూలై 14:** వేములవాడ పట్టణంలోని మూలవాగు బ్రిడ్జి నుండి రాజన్న ఆలయం వరకు చేపడుతున్న 80 అడుగుల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భవనాల కూల్చివేత పనులు కొన్ని రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. మూలవాగుపై నిర్మిస్తున్న రెండో వంతెన ఇరువైపుల భూసేకరణ నిమిత్తం దాదాపు 30 ఇళ్లను ఖాళీ చేయాలని ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. నిర్వాసితులు స్టే తీసుకున్నారు. నోటీస్ గడువు ముగియడంతో అధికారులు నిర్వాసితులను తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నష్ట పరిహారం ఇవ్వకుండానే కూల్చివేత ప్రారంభించడం ఏంటని ప్రభుత్వ తీరుపై నిరసన తెలుపుతూ దుకాణాలను ఖాళీ చేస్తున్నారు.

సోమవారం వేకువ జామున తిప్పాపూర్ బస్టాండ్ ఎదురుగా ఉన్న భవనాలు, దుకాణ సముదాయాలు, రేకుల షెడ్డులను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలగించు పనులు పునః ప్రారంభించారు కూల్చివేతలకు వచ్చిన అధికారులను బాధితులు అడ్డుకున్నారు. నష్టపరిహారం చెల్లించకుండానే ఇళ్లను కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేయగా అధికారులు మాత్రం బాధితులకు అందవలసిన పరిహారాన్ని ఇప్పటికే కోర్టులో జమ చేశామని, చట్టపరంగా కూల్చివేతలు చేపట్టినట్టు తెలిపారు. నష్ట పరిహారం మా చేతికి అందకుండానే కూల్చివేతలను ప్రారంభించారని ప్రభుత్వ తీరుపై బాధితులు మండిపడ్డారు.





### హోర్డింగ్ పైకి ఎక్కి నిరసన

ఈ క్రమంలోనే ఒక బాధితుడు సమీపంలోని భారీ హోర్డింగ్ పైకి ఎక్కి కూల్చివేత పనులను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వారికి నచ్చజెప్పి పనులు సాఫీగా సాగేలా చేశారు.

### ప్రభుత్వంపై మహిళ శాపనార్థాలు

ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వకుండా మా ఇల్లు కూలుస్తున్నారని.. ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని గెలిపిస్తే ఇల్లు కూలుస్తున్నారని మహిళ శాపనార్థాలు పెడుతూ తన ఇంట్లో ఉన్న సామాను తీసుకుంటా అనగా పోలీసులు వాదించి ఆటోలో మహిళను తరలించారు.

### పోలీసులతో పటిష్ట బందోబస్తు

మరోవైపు కూల్చివేతల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సీఐ వీరప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ బాధితులు తీవ్ర స్థాయిలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ తమ పాపం ఊరికే పోదు అంటూ నిందించడంతో అక్కడే ఉన్న అధికారులకు ఏమి చేయాలో తెలియక సతమతమయ్యారు. ఏది ఏమైనప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాలతో కూల్చివేతలను కొనసాగించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### కూలగొట్టడమే అభివృద్ధా..?

**ప్రతాప రామకృష్ణ**
**బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు**



హైదరాబాదులో హైడ్రా పేరిట, వేములవా డలో విస్తరణ పేరుతో సమయం ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేయడమే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధా? ఆలయం ముందు గత కొన్ని రోజుల క్రితం విస్తరణ పేరిట కూల్చిన మట్టిని ఇప్పటి వరకు తొలగించలేదు. ప్రభుత్వం వచ్చిన తర్వాత సామాన్యులకు మనుగడ లేదు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని అంటున్నారు మరి అభివృద్ధి ఎలా చేస్తారు? రోడ్డు విస్తరణలో పూర్తిగా ఉపాధి కోల్పోయే వారికి కనీసం ఉపాధి కల్పించండి. దౌర్జన్యంగా కూల్చే విధానాన్ని బిజెపి పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. రానున్న రోజుల్లో అధికార ప్రభుత్వానికి ప్రజలు సమాధానం చెబుతారు

### రోడ్డు నిర్మాణంతో ప్రజలకు సౌకర్యం

**సందీప్ కుమార్ ఝా**
**జిల్లా కలెక్టర్**

కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు నిర్మాణంతో భక్తులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు.



## గోశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలి
### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**వేములవాడ, జూలై 14:** వేములవాడ గోశాల పరిసరాలు ప్రతి నిత్యం శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం తిప్పాపూర్ గోశాలలోని జీవాలు, ఆవరణను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గోశాల ఆవరణను నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల నియమించిన సిబ్బందికి డ్రెస్ కోడ్ వారి పేర్లతో ఉండాలని సూచించారు. జీవాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సంరక్షించాలని ఆదేశించారు.

### విద్యార్థులతో పాఠాలు చదివించి..

తిప్పాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థితో అన్ని పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు. కలెక్టర్ వెంట వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాజన్నను దర్శించుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేములవాడ, జూలై 14:** చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వస్తితో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే స్వామివారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అద్దాల కళ్యాణ మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో రాధాబాయి ఎమ్మెల్యేకి శేష వస్త్రం కప్పి, స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జి.అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు జి.శ్రీనివాస్ శర్మ, ఇన్‌స్పెక్టర్ ఎం.రాజేందర్ ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం కేటాయింపుపై కృతజ్ఞత ర్యాలీ
### – పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**సిరిసిల్ల, జూలై 14:** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టంలోని నేతన్న విగ్రహం నుంచి భారత రాజ్యాంగ నిర్మాణ దాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం మీదుగా గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. గత ప్రభుత్వాలు స్థానిక సంస్థలకు బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం కేటాయించడం చారిత్రాత్మకమని ఎమ్మెల్యే అన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

**జనం పవర్, జన్నారం, జూలై 14:** ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు సోమవారం ధర్మారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. లబ్ధిదారులు తొడసం హేమలత, గంగు పటేల్ మాట్లాడుతూ సొంత ఇల్లు అనేది పేద, మధ్య తరగతి కుటుంబాల చిరకాల స్వప్నమని, ఇంటి నిర్మాణం చేయాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆదుకుంటోందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి జన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దుర్గం గంగాధర్, విలేజ్ కమిటీ అధ్యక్షులు కట్కూరి రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ద్యావల్ల భీమయ్య, ఉమారాణి, మాజీ వార్డు సభ్యులు నెమలికొండ గోపి, బీమరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

## ప్రజావాణితో సమస్యల పరిష్కారం
### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల, జూలై 14:** ప్రజావాణితో ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి. ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 244 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 75, హౌసింగ్ శాఖకు 64, డీఆర్డీఓకు 32, ఉపాధి కల్పన అధికారికి 15, జిల్లా విద్యాధికారికి 11, ఎస్‌డీసీ, జిల్లా పంచాయతీ అధికారికి ఏడు, జిల్లా వ్యవసాయ అధికారికి 6, నీటి పారుదల శాఖకు 4, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 3, ఏడీ మైన్స్, జిల్లా వైద్యాధికారికి రెండు చొప్పున, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా అటవీ శాఖ, మత్స్య శాఖ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఏడీ ఎస్ఎల్ఆర్, సీపీఓ, ఈడీఎంకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. అర్జీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ వినోద్ కుమార్, డిఆర్ డిఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**జనం పవర్, జన్నారం, జూలై14:** సమస్యల పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని జన్నారం తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలను తమకు తెలిపితే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

# కూరగాయలతో కళాకృతులు

**చందుర్తి, జూలై 14:** మండలంలోని మల్యాల హైస్కూల్లో కూరగాయలు అద్భుతమైన కళాకృతులుగా మారి చూపరులను ఆశ్చర్య పరుస్తున్నాయి. 6వ తరగతి పాఠ్యాంశంలో భాగంగా ఉపాధ్యాయురాలు మమత బోధించగా విద్యార్థులు నైపుణ్యంతో కూరగాయలతో వివిధ ఆకృతులను తయారు చేశారు. ఈ కళాకృతులు విద్యార్థుల సృజనాత్మక ప్రతిభకు నిదర్శనమని ఉపాధ్యాయురాలు మమత అన్నారు. ఈ ప్రదర్శనలో టమోటా, క్యారెట్, బీట్రూట్, బంగాళాదుంప, కాబేజి వంటి కూరగాయలను కత్తిరించి, చెక్కి విభిన్న కళారూపాలను సృష్టించారు. కాకరకాయతో తీర్చిదిద్దిన మొసలి, ఉల్లిగడ్డతో తయారు చేసిన తామర పుష్పం, బీట్రూట్, టమోటాలతో రూపొందించిన కుక్కపిల్లలు, ఆలుగడ్డలతో తయారు చేసిన గుడ్లగూబ అకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం చరత్ చంద్ర మాట్లాడుతూ ఇది కేవలం ఒక ప్రదర్శన కాదు, కూరగాయలను కొత్త దృష్టితో చూసే అవకాశమని, సాధారణంగా వంటలో మాత్రమే వాడే కూరగాయలను సృజనాత్మకంగా ఉపయోగించి అందమైన కళాఖండాలుగా మార్చవచ్చని తెలిపారు.

### మల్యాల హైస్కూల్‌లో ఆకట్టుకున్న ప్రదర్శన



ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె తిరుపతి, టీ ఝాన్సీ, జి స్వప్న, జి రవీందర్, కె అమర్‌నాథ్, ఎన్ మమత, పి లావణ్య, జె స్వప్న, ఆర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

# సుందరగిరి గ్రామం మీదుగా ఫోర్‌లైన్ రహదారి వద్దు

### ఏకగ్రీవంగా తీర్మానించిన గ్రామస్తులు



**చిగురుమామిడి, జూలై 14:** హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు నాలుగు వరుసల రహదారితో తాము ఇళ్లు కోల్పోతున్నామని చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి పక్కన ఉన్నవారి ఇండ్లు రోడ్డు విస్తరణతో ఇళ్లు పూర్తిగా కోల్పోతున్నామని, గ్రామం మీదుగా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని కోరుతున్నారు. గ్రామం మీదుగా రోడ్డు వద్దంటూ ఇటీవల హుస్నాబాద్-కరీంనగర్ రహదా రిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సోమవారం సుందరగిరిలోని రైతువేదికలో గ్రామస్తులు సమావేశమై ప్రజాభిప్రాయం, సంతకాలు సేకరించారు. ఇందులో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులందరు హాజరై గ్రామం మీదుగా కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్ తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతామన్నారు.

# వడ్డెరలను వెళ్లగొట్టడం దారుణం

### మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య

**జనం పవర్, జన్నారం, జూలై 14:** పొనకల్ గ్రామంలోని కుక్కల గుట్ట క్వారీలో బండలను కొట్టుకొని జీవనం సాగిస్తున్న వడ్డెరలను వెళ్లగొట్టడం చాలా దారుణమని జన్నారం అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాముల కొండయ్య అన్నారు. సోమవారం జన్నారం తహసీల్దార్ రాజమోహన్ రెడ్డికి ఈ విషయమై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాముల కొండయ్య మాటాడుతూ కొన్ని సంవత్సరాల నుంచి క్వారీలో బండలను కొట్టుకొని జీవనం సాగిస్తున్న వడ్డెరలను బండకొట్టుట నిషేధమని వెళ్లగొట్టడం దారుణమన్నారు. ఈ గ్రామంలో సుమారు 200 వరకు వడ్డెర కుటుంబాలు నివసిస్తున్నాయని, వారు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఈ కుటుంబాల వారికి ఎలాంటి వ్యవసాయ భూములు లేకపోవడమే కాకుండా ఇతరత్రా పనులు చేసుకునే పరిస్థితి కూడా లేదని, వారిని ఇప్పటి కిప్పుడే బండ కొట్టడం మానేయాలని, క్వారీకి వెళ్లవద్దని తహసీల్దార్ ఆదేశించడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. ఈ గుట్టపైన ఇటీవల బలహీన వర్గాల వారికి కొన్ని ఇండ్లు నిర్మించి, ఆ సాకుతో వడ్డెరలను క్వారీలోకి వెళ్ళవద్దని చెప్పడం దారుణమని అన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, జిల్లా గనుల శాఖ అధికారులు వీరి సమస్యపై స్పందించి వీరికి క్వారీలో బండను కొట్టుకునే అవకాశం కల్పించాలని కోరారు. క్వారీలో వడ్డెరలకు అనుమతిని ఇస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల అభివృద్ధి కమిటీ కన్వీనర్లు కోడూరి చంద్రయ్య, కడార్ల నరసయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, గూడ అశోక్, కాసెట్టి రాజన్న, దాసరి శ్రీనివాస్, వడ్డెర సంఘం నాయకుడు రాజు, ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు విజయ, తీట్ల రమేష్ బాబు, గోపతి జనార్ధన్, సాయివేణి సతీష్, జక్కుల మహేష్, జాతర్ల సుమన్, భూమయ్య, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.



# తెలంగాణ కాలనీలో అక్రమ నిర్మాణాలు

**అధికారుల మౌనం**
**వివాదాస్పదంగా మారిన వైనం**





**జనం పవర్, పటాన్చెరు, జూలై 14:** పటాన్చెరు నియోజకవర్గం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ కాలనీలో 27 సర్వే నంబర్లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు పత్రికల్లో ఈ విషయమై వార్తలు వెలువడినా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. గ్రామస్థుల కథనం ప్రకారం ఈ అక్రమ నిర్మాణాల విషయమై వారు ఎప్పటికప్పుడు సంబంధిత ఎమ్మార్వోకు వినతిపత్రాలు సమర్పించినా చర్యలు లేవు. రింగ్ రోడ్డుకు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉండి, పక్కనే పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల ఎంతో విలువైన ఈ భూమిని ఆక్రమించేందుకు కబ్జాదారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో గ్రామ అభివృద్ధికి ఈ భూమి ఉపయోగపడుతుందనే ఆలోచనతో కబ్జాకోరల నుంచి కాపాడాలని గ్రామస్తులు పోరాటం చేస్తున్నారు. అయితే, రెవెన్యూ అధికారులలో కొంతమంది అక్రమ నిర్మాణాలకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని అధికారులకు అండదండలు అందుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయని గ్రామస్తులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ అక్రమ నిర్మాణాలను తొలగించి, ఆ భూమిపై ప్రభుత్వ సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారి పై క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర బృందానికి అధికారులు అందుబాటులో ఉండాలి

**జిల్లా కలెక్టర్ కే. హైమావతి**




**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన పథకాల పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందానికి అధికారులు అందుబాటులో ఉండాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జోసెఫ్, వినోద్ ల నేతృత్వంలో జిల్లాకు వచ్చిన ఈ బృందం సభ్యులు సోమవారం కలెక్టరేట్ లో కలెక్టర్ కే. హైమావతి తో సమావేశమై జిల్లాలో వారు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించాల్సిన వివిధ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ పంపించిన బృందం నేటి నుంచి ఈ నెల 24 వరకు జిల్లాలోని బెజ్జంకి, అక్కన్నపేట, కొమరవెల్లి మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంఎన్ఆర్ఇజిఎస్, పింఛన్లు, వాటర్ షెడ్, గ్రామీణ సడక్ యోజన, పీఎం ఆవాస్ యోజన, గ్రామపంచాయతీలు, అర్బేటి తదితర 12 రకాల పథకాల అమలను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి కేంద్ర ప్రభుత్వ గ్రామీణభివృద్ధి శాఖకు అందజేస్తారని అన్నారు. ఆయా మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఏపీవోలు సంబంధిత ఇతర అధికారులు అందుబాటులో ఉండి జిల్లాలో అమలవుతున్న సంబంధిత పథకాలను క్షేత్రస్థాయిలో చూపించి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ అమీద్, డీఆర్డివో జయదేవ్ ఆర్య, హౌసింగ్ పీడీ దామోదర్ రావు, ఎల్డిఎం హరిబాబు, పంచాయతీరాజ్ ఈఈలు చిరంజీవి, శ్రీనివాస్ రెడ్డి, డిపిఓ దేవకీదేవి, డివిజనల్ పంచాయతీ అధికారులు, డిఆర్డిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**జనం పవర్, మోర్తాడ్, జూలై 14:** నిజామాబాద్ జిల్లా, బాల్కొండ నియోజకవర్గం, మోర్తాడ్ మండల కేంద్రంలోని సుంకేట్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు చేతుల మీదుగా కోమన్పల్లి రాజమణి కు అందజేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర ఆపదల్లో ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుపేదల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, మధ్యతరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు



**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** నంగునూర్ మండలంలో దేవులపల్లి యాదన్న చేతుల మీదుగా జోరుగా ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలు జరిగాయి. నంగునూర్ మండల కేంద్రం తో పాటు పాలమాకుల గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజలు చేశారు. అనంతరం ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ పదేండ్ల పాలనలో ఇండ్లు లేని పేదల నిరుపేదలకు డబుల్ బెడ్రూములు ఇస్తామని నమ్మించి కేసీఆర్ మోసం చేశాడని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరంగా మారిందన్నారు. ఇంతమంచి పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చెలికాని యాదగిరి, గౌరబోయిన సంపత్ కుమార్, కరెడ్ల వెంకట్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, దాసరి కిషన్, తుపాకుల శ్రీనివాస్,సాదుల పవన్,భాస్వరాజు రాములు, చేర్యాల బాలయ్య, రాగుల కనకయ్య, శివరాత్రి తిరుపతి, రంజిత్ గౌడ్, దుద్దెడ రాములు, వర్ధోళ్ల సాగర్, బోగి శ్రీనివాస్, బండి ఎల్లయ్య,చిన్న బాబు శిరీష, రంగు రాజు, కొంక రాము పాల్గొన్నారు.

# సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సై



**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** సిద్దిపేట టూ టౌన్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన మహమ్మద్ అసిఫ్ సోమవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ ఎస్సైని అభినందించి, శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు,వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. తరచుగా గ్రామాలను సందర్శించాలని తెలిపారు.

## దివ్యాంగుల జిల్లా మహాసభను
# విజయవంతం చేయాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాదిగ**



**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** ఈనెల 16న సిద్దిపేట మెట్రో గార్డెన్ లో నిర్వహించే దివ్యాంగుల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు మాదిగ పిలుపునిచ్చారు. విహెచ్పిఎస్, టిజిడిజేఏసీ వివిధ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక నియోజకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'హలో దివ్యాంగు.. చలో సిద్దిపేట్' దివ్యాంగుల జిల్లా మహాసభకు ముఖ్యఅతిథిగా దివ్యాంగుల ఆత్మబంధువుడు విహెచ్పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నా గాని దివ్యాంగులకు మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం 4016 పెన్షన్ ను 6016 వరకు, వృద్ధులకు, వితంతువులకు, బీడీ కార్మికులకు రూ.2,016 నుండి రూ.4,016 వరకు పెన్షన్ పెంచుతామని చెప్పి, ఇంతవరకు పెంచకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఎన్నో దివ్యాంగుల కుటుంబాలు ఆసరా పెన్షన్ పైన బతుకుతున్నారని తెలిపారు. సకాలంలో పెన్షన్ పడక ఎంతో ఇబ్బంది పడుతూ వచ్చిన పెన్షన్ కూడా వారి హాస్పిటల్ ఖర్చులకు కూడా సరిపోవటం లేదన్నారు. కొంతమంది దివ్యాంగులు ఒక పూట తింటూ మరో పూట పస్తులుంటూ కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగుల బాధలు కనిపించడం లేదా? దివ్యాంగులు అంటే ఇంత చిన్నచూపా? దివ్యాంగులు అంటే వివక్షత ఎందుకో తెలియడం లేదన్నారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడం లేదు. దివ్యాంగులకు అంత్యోదయ కార్డ్స్ మంజూరు చేయడం లేదు. దివ్యాంగులకు కూడా రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. సభకు దుబ్బాక నియోజకవర్గం నుండి దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, బీడీ కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు దొమ్మట జోగయ్య, చెక్కపల్లి మహేష్ మాదిగ, మండల ఉపాధ్యక్షులు వజపల్లి రాజేశ్వరరావు, ముక్కపల్లి కనకరాజు, ఎండి చాందుమియా, శ్రీగద రవి, గడ్డమీది లక్ష్మీనరసయ్య, లింగన్నపేట నరసయ్య, దాకలి రవి, ఊటకారి నర్సింహులు మండల ప్రశాంత్, జీడి కిరణ్ కుమార్, కళ్ళకు దేవలక్ష్మి, బొందు

# యూరియా కోసం తిప్పలు



**జనం పవర్, సంగెం, జూలై 14:** వానాకాలం పంటల సాగు చేస్తున్న రైతులు యూరియా బస్తాల కోసం పడరాని తిప్పలు పడుతున్నారు. సంగెం మండలం ఎల్గూర్ రంగంపేట సొసైటీ గోదాం వద్ద యూరియా కోసం రైతులు వేకువజామునుంచే పడిగాపులు కాస్తున్నారు. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో గంటల తరబడి నిలబడిన ఎరువులు దొరకడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో యూరియా కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే యూరియా కోసం క్యూలు కట్టాల్సి వస్తుందని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 6 గంటలకు వస్తే మధ్యాహ్నం రెండు గంటలకు యూరియా బస్తా లభించిందని దీని కోసం రెండు మూడు రోజులు పాటు వ్యవసాయ పనులు మానుకొని తిరగాల్సి వచ్చిందంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలన్నారు.

# 'రాష్ట్రాన్ని ఎడారిలా మారుస్తున్నారు'

**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బేషన్సే కాదు బేసిక్స్ కూడా తెలియవని సిద్దిపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి యాదవ్, కోల రమేష్ గౌడ్ అన్నారు. మండుటెండల్లో సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం మత్తల్లు దూకిపిస్తే, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎడారిలా మారుస్తుందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. తెలంగాణ సమాజం పట్ల, నీటి వసతుల పట్ల కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అన్నారు. రైతు ప్రయోజనాలను ఫణంగా పెడితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, కల్లపల్లి పంప్ హౌస్ వద్ద నీటి ఎత్తిపోతలు ప్రారంభించి రైతులకు నీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఏ రోజు కూడా రైతు మొగులుకు ముఖం పెట్టి చూడలేదని, ఇప్పుడు రైతు వర్షాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రైతులకు సరిపడా యూరియా కూడా అందించడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎరువుల ధరను పెంచి రైతుల నడ్డి విరుస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకరినొకరు రక్షణ కవచంలా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం



ఏర్పడి రెండేళ్లకు దగ్గరగా వస్తున్న ఇప్పటి వరకు మార్కెట్ కమిటీ చైర్మన్ కూడా నియమించకపోవడం రైతుల పట్ల కాంగ్రెస్కు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను కేసీఆర్, హరీష్ రావుల నేతృత్వంలో ఎండగడతామన్నారు. తెలంగాణ ప్రాంతం, ప్రజలపై ఆంధ్ర నాయకుల అవహేళనలు మానుకోవాలని, నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుల ద్వారా రైతులకు నీరందించాలని లేనిపక్షంలో పార్టీ నాయకత్వంలో మోటర్లు ఆన్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం కుర్చీ కాపాడుకోవడం గురించి ఆలోచించడం మాని ప్రజాపాలనపై దృష్టి సారించాలని హితువు పలికారు. ఈ సమావేశంలో నంగునూర్ మండల పార్టీ అధ్యక్షులు లింగం గౌడ్, కౌన్సిలర్ సుందర్, నాయకులు మొహీజ్, ఎల్లయ్య, బాబు, సతీష్, ఆకుబత్తిని, రాము, గోరేమియా పలువురు పాల్గొన్నారు.

# పదేళ్ల నిరీక్షణకు తెర

- కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ!
- జిల్లాలో 78,179 కుటుంబాలకు ప్రయోజనం
- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



**జనం పవర్,మానకొండూరు,జూలై 14:** పదేళ్ల నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కరీంనగర్ జిల్లాలో 78,179 తెల్ల రేషన్ కార్డులు పంపిణీ కానున్నాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. జిల్లాలోని 16 మండలాల్లో కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తొలి దశలో 38282 మందికి, రెండో దశలో 47,120 మందికి కలుపుకొని మొత్తం 78,179 రేషన్ కార్డులు పంపిణి కానున్నాయని ఆయన చెప్పారు. మండలాల వారీగా చూస్తే మానకొండూర్ మండలంలో 5113,తిమ్మాపూర్ మండలంలో 3,366, శంకరపట్నం మండలంలో 3,256, గన్నేరువరం మండలంలో 1,520, కరీనగర్ కార్పొరేషన్ పరిధిలో 18,484, కరీంనగర్ మండలంలో 4,381, కొత్తపల్లి మండలంలో 5,079, రామడుగు మండలంలో 4,315, సైదాపూర్ మండలంలో 3,098, హుజూరాబాద్ మండలంలో 6,031, జమ్మికుంట మండలంలో 5,060, ఇల్లందకుంట మండలంలో 2,374, వీణవంక మండలంలో 3929, చొప్పదండి మండలంలో 3,842, చిగురుమామిడి మండలంలో 3,172, గంగాధర మండలంలో 5,159 కొత్త కార్డులు జారీ కానున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వివరించారు. ఇక నుంచి పాత కార్డుదారులతో పాటు కొత్త రేషన్ కార్డులు పొందిన లబ్ధిదారులు కూడా చౌకధరల దుకాణాల నుంచి సన్న బియ్యం పొందుతారని ఆయన తెలిపారు.రాష్ట్రంలో రేషన్ కార్డులపై నాణ్యత కలిగిన సన్న బియ్యం ఇస్తున్న మాదిరిగా ఏరాష్ట్రంలో నూ ఇవ్వడం లేదని ఆయన స్పష్టం చేశారు. కార్డుల జారీ ప్రకియ నిరంతర కొన సాగుతున్నందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

## వెలిచాలను మర్యాద పూర్వకంగా కలిసిన
# పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజేష్



**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కాశి పాక రాజేష్ సోమవారం కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు రాజేష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.రాజేష్ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని రాజేందర్ రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నాయకులు బొమ్మ ఈశ్వర్ గౌడ్ బోనాల మురళి, గడ్డం శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# చెరువు కుంటల లెక్కలు తేల్చాలి


## కబ్జాకు గురైన వాటిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలి
## ఎన్ హెచ్ఆర్‌సి రాష్ట్రఅధ్యక్షుడు మొగుళ్ళ భద్రయ్య



**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** రాష్ట్రం లోని చెరువులు, కుంటల లెక్కలు తేల్చాలని, అవి అక్రమణలకు గురికాకుండా వెంటనే హద్దులు నిర్ణయించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు విలాసాగరం పృథ్వీ రాజ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలాచోట్ల చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని, అక్రమణదారులు కొంతమంది రాజకీయ నాయకులు, అధికారుల అండతో నకిలీ పత్రాలు సృష్టించి పట్టాలు పొందారని, వాటిపై బ్యాంకులలో రుణాలు, రైతుబంధు, రైతు భరోసా లాంటి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కనుమరుగవు తున్న చెరువు,కుంటల లెక్కలు తీసి ఆక్రమణలు జరిగినచోట సంబంధిత అధికారులను బాధ్యులుగా చేసి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. చెరువులను, కుంటలను రక్షించే బాధ్యత సంబంధిత అధికారులదేనని ఆయన స్పష్టం చేశారు. అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేయాలని, వారికి క్షేత్రస్థాయిలో సహకరించిన రెవెన్యూ, నీటిపారుదల అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్ల చంద్రయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు వడ్డీక అనిల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవి గౌడ్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, కరీంనగర్ పట్టణ అధ్యక్షులు హరీష్, జిల్లా అధికార ప్రతినిధి నూనెశ్రీనివాస్, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు అభిషేక్, జిల్లా నాయకులు మధుకర్, సామాజిక ఉద్యమకారులు కాట్నపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా
# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## జాయింట్ కలెక్టర్ అరుణశ్రీ



**జనం పవర్, గోదావరిఖని, జూలై 14:** వర్షా కాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా నగర పాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్,స్థానిక సంస్థలు నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ అన్నారు. సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోమునిసిపల్ ప్రజారోగ్యవిభాగం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ,సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటింటిని సందర్శించి జ్వర సర్వే నిర్వహించాలని అన్నారు. సర్వే నిర్వహించే సందర్భంలో పారిశుధ్య సమస్యలు దృష్టికి వస్తేనగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగం దృష్టికి తీసురావాలని అన్నారు.సమన్వయం కొరకు ఇరు విభాగాల సిబ్బంది ఫోన్ నెంబర్ లతో ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో మలేరియా, డెంగ్యూ అనుమానిత కేసులు వచ్చినప్పుడు మునిసిపల్ సిబ్బందికి వారినివాస సమాచారం అందిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి పెట్టి అంటువ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సీజనల్ వ్యాధుల నియంత్రణపై కూడా దృష్టి సారించి త్రాగు నీటి క్లోరినేషన్, నిలువ ఉన్న నీరుతొలగించడం,బ్లీచింగ్,స్ప్రెయింగ్, ఫాగింగ్ ,ఆయిల్ బాల్స్ వదలడం వంటి అనేక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అన్న ప్రసన్న కుమారి మాట్లాడుతూ అంటువ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. నివాసాల మధ్యలో అపరిశుభ్రత నెలకొన్న పరిసరాల వివరాలను మునిసిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. నగర పాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ సమష్టిగా పని చేసి ఈ వర్షా కాలంలో అంటువ్యాధులు విజృభించకుండా అరికట్టేందుకు కృషి చేద్దామని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్ నాయినివెంకట స్వామి, పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యులు మానికేశ్వర్ రెడ్డి,సాదిక్, పాషా అహల్య,పద్మ,రమణి, దీవెన,స్నేహలత, నగరపాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్లు నాగ భూషణం, కిరణ్, కుమార స్వామి, జూనియర్ అసిస్టెంట్ శంకర్ స్వామి,మెప్మా టి ఎం సి మౌనిక, సానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

# కుటుంబ నియంత్రణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

## జిల్లా వైద్యాధికారి వెంకటరమణ



**జనం పవర్, కరీంనగర్, జూలై 14:** కుటుంబ నియంత్రణకు అర్హులైన దంపతులలో పురుషులు కుటుంబ, సామాజిక బాధ్యతగా వేసక్టమి ఆపరేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరుగుతున్న కుటుంబనియంత్రణ శస్త్రచికిత్సల శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా శస్త్ర చికిత్సలు చేసు కోబోతున్న,చేసుకున్న అర్హులైన దంపతులను కలిసి మాట్లాడుతూ పిల్లలు వద్దనుకున్న వారికి వేసెక్టమి చాలా సులువైన విశ్వసనీయమైన, మార్గమని తెలిపారు. దీనివల్ల ఎటు వంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు.వారం రోజులపాటు వైద్యుల సలహాలు,సూచనలను పాటిస్తూ విశ్రాంతి తీసుకుని దైనందిన జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. ఈనెల 17న తేదీ జిల్లా ఆస్పత్రిలో, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రిలో, జమ్మికుంట సామాజిక ఆసుపత్రి జమ్మికుంటలో వాసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని కుటుంబ నియంత్రణ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడిటిటి డాక్టర్ ఉమాశ్రీ,పిఓ ఫ్యామిలీ ప్లానింగ్ డాక్టర్ సన జవేరియా, వైద్య సిబ్బంది, శాశ్వత కుటుంబ నియంత్రణకు అర్హులైన దంపతులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగంపై కేంద్రం వివక్ష విడనాడాలి

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**జనం పవర్, గోదావరిఖని, జూలై 14:** కేంద్రప్రభుత్వం తెలంగాణ రైతాంగంపై వివక్షను విడనాడాలని, ఆర్ఎఫ్‌సిఎల్‌లో ఉత్పత్తి అయిన యూరియాలో 60 శాతం వాటా తెలంగాణ రైతాంగానికి ఇవ్వాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ డిమాండ్ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధి లోని రామగుండం ఆర్ఎఫ్ సిఎల్ ఫ్యాక్టరీని సోమవారం ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో నష్టాల్లోకి వెళ్ళిన ఎఫ్‌సిఐ, ఎరువుల కర్మాగారాన్ని ఇక్కడి రైతు లకు యూరియా అవసరాలను గుర్తించి కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌తో మాట్లాడి తన తండ్రి వివేక్ వెంకటస్వామి 10 వేల కోట్ల మాడిటోరీయం ఇప్పించి ఆర్ ఎఫ్ సి ఎల్‌ను పునః ప్రారంభించారని తెలిపారు. కానీ బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రైతులకు సకాలంలో యూరియా అందించకుండా వివక్ష చూపుతుందని ఆరోపించారు. ఆర్ఎఫ్‌సిఎల్‌లో ఇటీవల ప్రొడక్షన్ కూడా తగ్గిందని కేంద్రం ప్రకటించిందని, ఈవిషయంలో కేంద్రమంత్రి వర్గంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడడం కూడా జరిగిందని వెల్లడించారు. కేంద్రప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక మాదిరిగా, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఒక మాదిరిగా వ్యవ హరిస్తూ వస్తుందని విమర్శించారు. ఆర్ఎఫ్‌సిఎల్‌లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో తెలంగాణ ప్రాంత రైతులకు 30 శాతం వాటాను మాత్రమే ఇస్తున్నారని, న్యాయం తెలంగాణ రైతాం గానికి రావాల్సిన 60 శాతం వాటాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాం గానికి ఇవ్వాల్సిన యూరియాపై అవసరమైతే పార్లమెంట్‌లో పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సిఎల్, జిఎం రాజీవ్ కుల్ బే, హెచ్ ఆర్, అజయ్, అధికారులు శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.మల్లికార్జున్, కామ విజయ్, పాకాల గోవర్ధన్, గుమ్మడి కుమారస్వామి, తిరుపతి తదితరులు ఉన్నారు.

# గోదావరిఖనిలో గోరింటాకు సంబరాలు



**జనం పవర్, గోదావరిఖని, జూలై 14:** గోదావరిఖని శ్రీరాంనగర్‌లో ఆషాఢం గోరింటాకు వేడుకలను మహిళలు ఒక పండగలా జరుపుకున్నారు. సోమవారం శ్రీరామ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ గోరింటాకు వేడుకలకు రామగుండం ఎమ్మెల్యే సతీమణి మానాలి ఠాకూర్ హాజరై మహిళలతో కలిసి గోరింటాకును దంచి, చేతులకు గోరింటాకును పెట్టుకుంటూ ఆనందంగా గడిపారు. మహిళలకు ఒకరికొకరు చేతులకు గోరింటాకు పెట్టుకొని పండిన తమ చేతులను చూసి మురిసి పోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి మానాలి ఠాకూర్ తో పాటు కాలనీ మహిళలు మాట్లాడుతూ ఆషాఢం మాసంలో మహిళలు ఇష్టంగా తమ చేతులకు గోరింటాకు పెట్టుకొని ఎర్రగా పండిన తమ చేతులను చూసుకొని మురిసిపోవడం అనాదిగా వస్తుందని తెలిపారు. ఎన్నో ఔషధ గుణాలు కలిగిన గోరింటాకును పెట్టుకోవడం మూలంగా మహిళల్లో అందంతోపాటు ఆరోగ్యపరమైన లాభా లు కూడా ఉంటాయని అన్నారు. గోరింటాకు ఆషాఢం మా సంలో పెట్టుకోవడం మూలంగా ఒంట్లోని వేడిని కూడా తీసివేస్తుందని, చర్మ సంబంధిత వ్యాధులను తొలగిస్తుందని వెల్లడించారు. గోరింటాకు వేడుకలతో మహిళల్లో ఐక్య త కూడా పెరుగుతుందని సూచించారు. మన పూర్వీకులు మనకు నేర్పించిన మంచి సాంప్రదాయాలను, మంచి కట్టుబాట్ల ను ఈతరం పిల్లలకు నేర్పించాల్సిన భాధ్యతగా మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ తాజా మా జీ కార్పొరేట్ అడ్డాల గట్టయ్య తిరుమల, మాజీ కార్పొరేటర్ పిడుగు కృష్ణ, శ్రీరామ మిత్రమండలి సభ్యులు రంగు తిరుపతి, మామిడి వీరేశం, రంగు కృష్ణ, జయరాం, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన
# ఇద్దరికి జైలుశిక్ష

**జనం పవర్, గోదావరిఖని, జూలై 14:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర రావు గారి ఆధ్వర్యంలో గోదావరిఖనిలో డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన తొమ్మిది మందిని సోమవారం సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని,వెంకటేష్ దుర్వ, ముందు హాజరుపరుచగా వారికి 17,000 రూ పాయల జరిమానా విధించారు. వీరిలో రెండోసారి పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, విధించారు. ఇద్దరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలిం చారు. ఇందులో ఒక వ్యక్తి ఆటో డ్రైవర్ ఉన్నారు. పట్టణ ప్రజలకు మద్యం తాగి వాహనం నడపరాదని, టూవీలర్లు హెల్మెట్లు పెట్టుకోవాలని ఫోర్‌వీలర్లు సీట్‌బెల్ట్ పెట్టు కోవాలని ట్రాఫిక్ రూల్స్ పాటించా లని రామగుండం ట్రాఫిక్ సిఐ బి రాజే శ్వరరావు, తెలిపారు,

జనం పవర్ సినిమా

15-07-2025, మంగళవారం



# ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్: 'కన్నప్ప' బ్యూటీ ప్రీతి ముకుందన్



ఇటీవల వచ్చిన 'కన్నప్ప'తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు నటి ప్రీతి ముకుందన్. ఆ సినిమాలో అగ్ర కథానాయకుడు ప్రభాస్ కీలకపాత్రలో కనిపించిన సంగతి తెలిసిందే. ఆయనతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడంపై ప్రీతి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్ అని అన్నారు. ''కన్నప్ప లాంటి భారీ ప్రాజెక్ట్‌లో అనుకోకుండా అవకాశం వచ్చింది. కొన్నిసార్లు మన ప్రమేయం లేకుండా ఇలాంటి పెద్ద సినిమాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి. సవాలుగా ఉండే పాత్రలంటే నాకు ఇష్టం. అవి కష్టంగా ఉన్నప్పటికీ గుర్తింపు తెస్తాయి. అలాంటి పాత్రలు ఉంటే ఆడిషన్ ఇవ్వడానికి సిద్ధమే. కన్నప్పలో ప్రభాస్‌తో కలిసి నటించడం ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ పాజిటివిటీ ఉంటుంది. ఆయన ప్రత్యేకత స్క్రీన్‌పై కూడా స్పష్టంగా కనిపించింది. నిజ జీవితంలోనూ ప్రభాస్ చాలా స్వీట్ పర్సన్. ఆయన పాన్ ఇండియా స్టార్ అయినప్పటికీ సాధారణంగా ఉంటారు. ఎవరినీ చిన్నచూపు చూడరు. సెట్‌లో అందరినీ గౌరవిస్తారు'' అని ప్రీతి ముకుందన్ చెప్పారు. మంచు విష్ణు హీరోగా వచ్చిన 'కన్నప్ప'లో ప్రభాస్ రుద్ర అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించారు. వీరిద్దరి మధ్య సంభాషణలు సినిమాకే హైలైట్‌గా నిలిచి ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక 'ఓం భీమ్ బుష్'తో టాలీవుడ్‌కు పరిచయమైన ప్రీతి ముకుందన్ 'కన్నప్ప'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'మైనే ప్యార్ కియా'లో నటిస్తున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం ఆగస్టు 29న విడుదల కానుంది.

# 'జూనియర్'.. కొత్త అనుభూతిని అందిస్తుంది

''విజువల్‌గా ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని అందించే చిత్రం 'జూనియర్'' అన్నారు కిరీటి. ఆయన హీరోగా పరిచయమవుతున్న ఈ పాన్ ఇండియా సినిమాని రాధాకృష్ణ తెరకెక్కించారు. రజని కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానున్న నేపథ్యంలో ఆదివారం బెంగళూరులో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. శివ రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''ఈ చిత్ర టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ చూశాను. కిరీటి అద్భుతంగా డ్యాన్స్ చేశాడు. నటన కూడా అద్భుతంగా ఉంది. దర్శకుడు దీన్ని అద్భుతంగా తెరకెక్కించారు. ఇది చాలా పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా'' అన్నారు. ఈ సందర్భంగా ఆయన కిరీటి, శ్రీలీలతో కలిసి ''వైరల్ వయ్యారి'' పాటకు స్టెప్పులేసి అలరించారు. ఈ కార్యక్రమంలో గాలి జనార్దన్ రెడ్డి, జెనీలియా, రవిచంద్రన్, సాయి కొర్రపాటి, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.




# గత 110 ఏళ్ల టెస్టు చరిత్రలో టాప్ బౌలర్‌గా బోలాండ్.. ఐదో స్థానంలో బుమ్రా

వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పేసర్ స్కాట్ బోలాండ్ అరుదైన ఘనత సాధించాడు. విండీస్‌పై తొలి ఇన్నింగ్స్‌లో బోలాండ్ 13.1 ఓవర్లు వేసి 34 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు. దీంతో 1915 తర్వాత టెస్టు క్రికెట్ చరిత్రలో (కనీసం 2000 బంతులు వేసిన) అత్యంత బెస్ట్ బౌలింగ్ ఎకానమీతో బంతు లేసిన బౌలర్‌గా నిలిచాడు. ప్రస్తుతం అతడి బౌలింగ్ యావరేజీ 17.33. ఓవరాల్‌గా టెస్టు చరిత్రలో బోలాండ్ కంటే ముందు ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఆరుగురు 1900 సంవత్సరం కంటే ముందు కాగా.. ఇంగ్లాండ్ బౌలర్ జీఏ లోమన్ 10.75 సగటుతో టాప్‌లో కొనసాగుతున్నాడు. 1900 తర్వాత ఇంగ్లాండ్‌కే చెందిన బర్న్స్ మాత్రమే (1901-1914) బోలాండ్ కంటే ముందుండటం గమనార్హం. బర్న్స్ బౌలింగ్ సగటు 16.53. ఈ జాబితాలో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా 19.48 సగటుతో ఐదో స్థానంలో ఉన్నాడు.

**ఆసక్తికరంగా మూడో టెస్టు..**

బౌలింగ్‌కు అనుకూలించిన కింగ్‌స్టన్ పిచ్‌పై విండీస్ - ఆసీస్ మూడో టెస్టు ఆసక్తికరంగా మారింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 225 పరుగులకు ఆలౌట్ కాగా.. ఆతిథ్య జట్టు కూడా మొదటి ఇన్నింగ్స్‌లో 143 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్‌కు 82 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ బౌలర్ల దెబ్బకు ఆస్ట్రేలియా తడబాటుకు గురైంది. రెండోరోజు ఆట ముగిసే సమయానికి 99 పరుగులకే ఆరు వికెట్లను కోల్పోయింది. ప్రస్తుతం క్రీజ్‌లో కామెరూన్ గ్రీన్ (42*), పాట్ కమిన్స్ (5*) ఉన్నారు. మొత్తం ఆధిక్యం 181 పరుగులకు చేరింది. అల్జారీ జోసెఫ్ 3, షమర్ జోసెఫ్ 2 వికెట్లు తీశారు.



# ఇంకా 135 పరుగులు.. 'లార్డ్స' చరిత్ర ఏం చెబుతోంది?



క్రికెట్‌కు పుట్టినిల్లు 'లార్డ్స్'లో విజయం సాధించాలంటే భారత్‌కు మరో 135 పరుగులు అవసరం. ఇంగ్లాండ్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్య ఛేదనలో ప్రస్తుతం టీమ్‌ఇండియా 58/4 స్కోరుతో కొనసాగుతోంది. ఇక్కడ రెండోసారి బ్యాటింగ్ చేసిన జట్టు చాలా తక్కువ విజయాలను నమోదు చేసిందని గత చరిత్ర చెబుతోంది. కానీ, కొద్ది రోజుల కిందట ఫలితాన్ని చూస్తే మాత్రం భారత్‌కు అనుకూలంగానే ఉందని చెప్పాలి. మరి ఇక్కడ అత్యధిక లక్ష్య ఛేదన ఎంత? టీమ్‌ఇండియా ఎప్పుడు విజయం సాధించిందనే విషయాలపై ఓ లుక్కేద్దాం.

**చివరిసారిగా..**

భారత్ చివరిసారిగా లార్డ్స్‌లో లక్ష్య ఛేదనకు దిగి 1986లో విజయం సాధించింది. అప్పుడు టార్గెట్ 133 పరుగులే. కానీ, ఆ లక్ష్యాన్ని చేరుకొనేందుకు టీమ్‌ఇండియా ఐదు వికెట్లను కోల్పోయింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా కపిల్ దేవ్ నిలిచాడు. రవిశాస్త్రి, మహ్మద్ అజహరుద్దీన్ కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆ తర్వాత 1990, 2002లో జరిగిన మ్యాచుల్లో ఇంగ్లాండ్ నిర్దేశించిన లక్ష్యాన్ని భారత్ ఛేదించలేక ఓటమిపాలైంది. ఈ రెండు సందర్భాల్లోనూ 460+ టార్గెట్ కావడం గమనార్హం.

**డబ్ల్యూటీసీ ఫైనల్‌లో..**

ఇటీవల ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ లార్డ్స్ వేదికగానే జరిగింది. స్టార్ బౌలింగ్ విభాగం కలిగిన ఆసీస్‌ను ఎదురొడ్డి మరీ దక్షిణాఫ్రికా ఛాంపియన్‌గా నిలిచింది. ఆ జట్టు నిర్దేశించిన 282 పరుగుల టార్గెట్‌ను దక్షిణాఫ్రికా ఐదు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. అంతకుముందు న్యూజిలాండ్‌పై 2022లో ఇంగ్లాండ్ 279 పరుగుల టార్గెట్‌ను కొట్టేసింది. ప్రస్తుతం లార్డ్స్ పిచ్ బౌలింగ్‌కు అనుకూలంగా మారిన నేపథ్యంలో భారత్‌కు చివరిరోజు 135 పరుగులను చేయడం సవాలే. కానీ, తొలి గంట ఆట కీలకం కానుంది. పరుగులు రాకపోయినా క్రీజ్‌లో నిలదొక్కుకుంటే టీమ్‌ఇండియాకు విజయం దక్కడం పెద్ద కష్టమేం కాదు. క్రీజ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ కాకుండా.. ఇంకా నలుగురు ప్రధాన బ్యాటర్లు ఆడాల్సి ఉండటం భారత్‌కు సానుకూలాంశమే.

**ఇవే భారీ విజయాలు..**

* ఇంగ్లాండ్‌పై విండీస్ 1984లో 344/1
* న్యూజిలాండ్‌పై ఇంగ్లాండ్ 2004లో 282/3
* ఆస్ట్రేలియాపై సౌతాఫ్రికా 2025లో 282/5
* న్యూజిలాండ్‌పై ఇంగ్లాండ్ 2022లో 279/5.. 1965లో 218/3
* విండీస్‌పై ఇంగ్లాండ్ 2012లో 193/5.. 2000లో 191/8

PRINTED PUBLISHED,OWNED BY M.VENKATA RAMANA ,PRITED AT MYTHRI ART PRINTERS 10,DCC COMPLEX,MAHABUBNAGAR509001,TELANGANA,PUBLISHED FROM 10180/4, VIGNESHWARA COLONY, MARLU, MAHABUBNAGAR 509001,TELANGANA, RNI NO.TELTEL/2016/69862, EDITOR : M.VENKATA RAMANA : PH:96181 81112

# ఇండ్ల నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక, మొరం కేటాయింపు
- ట్రాక్టర్ ఇసుక రవాణాకు రూ. 1500 మించి చెల్లించవద్దు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల, జూలై 14:** ఇండ్ల నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణ పై జిల్లా ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్, కంకర, ఇటుక ధరలు పెరగకుండా నియంత్రించాలని అన్నారు. ఇసుక సమస్య లబ్దిదారులకు రాకుండా ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని అన్నారు. వార్తా పత్రికల్లో ఇసుక రూ.6 వేలకు అమ్ముతున్నట్లు వార్తలు వస్తున్నాయని, దీనిపై మండల స్థాయిలో తహసీల్దార్లు దృష్టి సారించాలని, లబ్ధిదారులపై రవాణా ఖర్చు మినహా ఇసుక కొనుగోలు నిమిత్తం ఎటువంటి భారం పడటానికి వీలు లేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల వద్ద అధిక ధరలకు ఇసుక ఎవరు విక్రయిస్తున్నారో విచారించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి రూ.1500 కంటే ఎక్కువ ట్రాక్టర్ ఇసుక రవాణా కోసం తీసుకుంటే సమాచారం అందించాలని, అటువంటి వారిపై పోలీస్ కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఇంటి నిర్మాణానికి మొరం ఎంత అవసరం అవుతుందో పక్కా లెక్కలు వేయాలని అన్నారు. సిరిసిల్ల, వేములవాడ లో మొరం అక్రమ రవాణా జరుగకుండా చూడాలని అన్నారు.నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ఇసుక, మొరం కేటాయింపు చేయాలని అన్నారు. మండల అధికారులు సెలవు రోజుల్లో హెడ్ క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని, ఏదైనా వ్యక్తిగత పనిపై ఉండలేకపోతే ప్రత్యామ్నాయ అధికారిని అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులు లబ్ది దారుల ఉంటే వారి ట్రాక్టర్లను కూడా ఉపయోగించి ఇసుక తీసుకుని వెళ్ళవచ్చని అన్నారు.

అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇసుక, మొరం తరలింపు అనుమతుల మేరకు మాత్రమే జరగాలని, అనుమతి పత్రాలు లేనిది జరుగడానికి వీలు లేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట అక్రమ రవాణా జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా నోటి మాటతో ఇసుక, మొరం తరలించడానికి వీలు లేదని, సరియైన అనుమతి పత్రాలతో మాత్రమే రవాణా చేయాలని, లేనియెడల అట్టి వాహనాలను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్‌డిఓ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, పీడీ హౌసింగ్ శంకర్, జెడ్పీ సిఈఓ వినోద్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలు, పందులు, కోతుల నుంచి ప్రజలను కాపాడండి

### ఎంసిపి(ఐ) యు పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం




**జనం పవర్, బెల్లంపల్లి, జూలై 14:** బెల్లంపల్లి పట్టణంలో కుక్కలు, పందులు, కోతుల బెడద నుంచి ప్రజలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌కు ఎంసిపి(ఐ) యు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంసిపి(ఐ)యు మంచిర్యాల జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ, బెల్లంపల్లి పట్టణంలో కుక్కల పందుల కోతుల బెడద చాలా ఎక్కువైందని గతంలో ఎన్నో సార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని అన్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దవారి దాకా ఎంతో మందిని వీధి కుక్కలు కరిచి గాయాలు చేస్తే పలువురు ఆసుపత్రుల పాలయ్యారని అన్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ గాయాల పాలు చేస్తున్నాయని, ఆవులు నడిరోడ్ల పైన తిరుగుతూ రాత్రి వేళలో రోడ్లపై పడుకొని వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఈ సమస్యలపై స్పందించి వెంటనే రోడ్లపై పడుకుంటున్న ఆవులను గోశాలకు తరలించాలని, కుక్కలు పందుల, కోతుల నుండి ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎంసిపి(ఐ)యు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరేపల్లి రమేష్, ఆకాష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ గ్రేడ్ కమిషనర్ రవికుమార్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

**రాజేంద్రనగర్, జూలై 14:** స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన రాజేంద్రనగర్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను బీజేపీ నాయకులు సోమవారం సర్కిల్ కార్యాలయంలో కలిసి సన్మానించారు. సర్కిల్ అభివృద్ధికి కృషి చేస్తూ సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటూ డిసి తనదైన ముద్రను వేసుకున్నారని బీజేపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై. శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం. కొమురయ్య, జిల్లా ఓసీ సెల్ కన్వీనర్ జయానంద్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సుల్గే వెంకటేష్, రఘురామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**అందోల్, జూలై 14:** అందోల్ మండలం జోగిపేట పట్టణంలోని మొండి గుట్ట కింద ట్రాన్స్ఫార్మర్ విద్యుత్ షాక్‌తో ఓ నిరుపేద రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. పట్టణానికి చెందిన కుమ్మరి సుధాకర్ రోజు వారిలాగే ఎడ్లను మేపడానికి వదలడంతో ఒక ఎద్దు మేసుకుంటూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ కంచె విషయమై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన రైతు వాపోయాడు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం అందించాలని ఆయన బోరున విలపిస్తూ కోరారు.

# 'కూలిపోయే కాళేశ్వరంలో నీళ్లు నింపుతామనడం అవివేకం'

**జనం పవర్, గోదావరిఖని, జూలై 14:** కూలిపోయే కాళేశ్వరంను కేసీఆర్‌కు అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్ళు నింపుతామనడం మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి అవివేకమని కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంకాళి స్వామి, గట్ల రమేష్ అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి చేతకాని మాజీ ఎమ్మెల్యే ఇంటికి వచ్చి కూలేశ్వరంపై అబద్ధపు మాటలు మాట్లాడడం జరిగిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపితే కూలిపోయే ప్రమాదం ఉందని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సంస్థ, ఎల్‌అండ్‌టి, సంస్థలు ప్రకటించిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నింపకుండా కిందకు వదలడం జరుగుతుందని వెల్లడించారు. రామగుండం ప్రాంతానికి రావాల్సిన 4 వేల మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పట్టుకు పోతే అడ్డుకోవడం చేతగాని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మిగిలి పోయారని



ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అబద్ధపు మాటలతో ప్రజలను మభ్య పెట్టాలని వస్తున్నారని ఆరోపించారు. ఎన్ని వేషాలు వేసిన ప్రజల తిరస్కరణకు గురైన బీఆర్ఎస్ పార్టీ ప్రజల మద్దతు కూడగట్టుకోవడం కలగానే మారి పోతుందని అన్నారు. కాళేశ్వరంపై విచారణ జరుగుతుందని, అందులో దోషులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్, కాల్వ లింగస్వామి, ముస్తఫా,మారెల్లి రాజిరెడ్డి, బొమ్మక రాజేష్, కళ్యాణి సింహాచలం, యుగేందర్, నాయిని ఓదెలు, గుండేటి శంకర్‌పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేట మండలంలో చిరుత పులి సంచారం

- భయాందోళనలో స్థానిక రైతులు
- చిరుత వేలిముద్ర సేకరించిన ఫారెస్ట్ అధికారులు

**ఎల్లారెడ్డిపేట, జూలై 14:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులో చిరుత సంచరించినట్లు స్థానిక రైతులు తెలిపారు. సోమవారం రాకెట్ల పల్లి గ్రామానికి చెందిన రాయం సురేష్ అనే రైతు ఉదయం తన పొలానికి వెళ్లి బోర్ మోటర్ ఆన్ చేసే ప్రయత్నంలో చిరుత అతని కంటపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన సురేష్ పరుగులు తీస్తూ చుట్టుపక్కల రైతులకు సమాచారం అందించాడు. చుట్టుపక్క రైతులు వెంటనే అక్కడికి చేరుకొని చిరుత సంచరించిన వేలిముద్రలను చూసి వీడియోలు ఫోటోలు తీసి ఫారెస్ట్ అధికారులకు పంపించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ గొల్లపల్లి సెక్షన్ ఆఫీసర్ సక్కా



రం, వీర్నపల్లి సెక్షన్ ఆఫీసర్ రంజిత్ కుమార్, ఎఫ్ ఆర్‌వో శ్రీహరి ప్రసాద్, వెంకటాపూర్ బీట్ ఆఫీసర్ అనుష ఎల్లారెడ్డిపేట పోలీసులను కలిసి సంఘటన స్థలం చేరుకొని వేలిముద్రలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. చిరుత పులి సంచరించిన విషయాన్ని తెలుసుకున్న చుట్టుపక్క ప్రాంతాల రైతులు పంట పొలాల్లోకి వెళ్లాలంటే తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు చిరుత అడుగుజాడలను గుర్తించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీహరి ప్రసాద్ మాట్లాడుతూ రాకెట్లపల్లె శివారు చిరుత సంచరించిన మాట నిజమేనని చుట్టుపక్క ప్రాంత రైతులు ఆవులను, గేదెలను, ఇతర మూగజీవులను పంట పొలాలు రాత్రివేళలో ఉంచకూడదన్నారు. అలాగే ఎవరైనా సరే గుంపులు గుంపులుగా కర్రలతో వెళ్లాలని ఒంటరిగా ఎవరు కూడా వెళ్ళకూడదన్నారు. ముఖ్యంగా మేకలు కాపర్లు పంట పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న మేకల మందను అక్కడి నుంచి తొలగించి సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## అర్హులైన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలి

### ఎమ్మార్వో, ఈవోలకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు



**ముస్తాబాద్, జూలై 14:** నిజమైన అర్హులకే డబుల్ బెడ్ రూం కేటాయింపులు జరగాలని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మార్వో సురేష్, ఈవో రమేష్‌లకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు సురేందర్ రావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరుపేద కుటుంబానికి చెందిన అర్హురాలు నంతాబాద్ బాలలక్ష్మి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం కేటాయింపు జరిగిందని తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు సంజీవ్ ఉన్నారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో బాలలక్ష్మి మృతి చెందడంతో కుమారుడు సంజీవ్ ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. తల్లి మరణంతో తీవ్ర దుఃఖంలో ఉన్న సంజీవ్‌కు డబుల్ బెడ్ రూం రద్దు చేసి వేరే వారికి కేటాయించడం సరికాదని అన్నారు. గ్రామసభలో డబుల్ బెడ్ రూం కేటాయింపు తీర్మానం కాపీ ఉందని, మూడు సంవత్సరాలుగా అదే ఇంటిలో నివసిస్తున్నారని ప్రొసిడింగ్ ఇవ్వలేదనే రద్దు చేస్తామనడం సరైన చర్య కాదని అన్నారు. యథావిధిగా ఆ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీ అర్హులైన నిరుపేదల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.


ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు, ఎద్దండి నర్సింహా రెడ్డి, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యులు యండి.సర్వర్ పాషా, మాజీ సెస్ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, మాజీ సర్పంచ్ గాండ్ల సుమతి గాడిచెర్ల దేవయ్య, మాజీ కో ఆప్షన్ అన్వర్, గూడూరి భరత్, రమేష్ రెడ్డి, కోడె శ్రీనివాస్, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, యూత్ మండల అధ్యక్షులు శీలం స్వామి, నాయకులు తాళ్ల రాజు, దొరగొల్ల బాలయ్య, యండి జహంగీర్, పల్లె సత్యం ముస్తాబాద్ సోషల్ మీడియా వారియర్ బద్దీపడిగే నందు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో పీవీ నరసింహారావు పేరుతో ఆడిటోరియం

- రూ.20 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మాణం
- 4000 మంది సీటింగ్ సామర్థ్యం

**జనం పవర్, పటాన్‌చెరు, జూలై 14:** భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని పటాన్‌చెరు పట్టణంలో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆధునిక ఆడిటోరియం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఆడిటోరియాన్ని దేశ మాజీ ప్రధాని, తెలంగాణ గర్వకారణమైన పీవీ నరసింహారావు పేరుతో నిర్మిస్తున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. సోమవారం సాయంత్రం బ్లాక్ ఆఫీస్ ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులను జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీ





లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగానికి నూతన దిశను చూపిన నాయకుడు పీవీ నరసింహారావు. ఆయన పేరును ఆడిటోరియానికి పెట్టడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆయన విశిష్టతను గుర్తు చేయాలన్నది మా లక్ష్యమని అన్నారు. ఆడిటోరియానికి ఎదురుగా పీవీ కాంస్య విగ్రహాన్ని కూడా ఏర్పా టు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిర్మా ణం రెండు అంతస్తుల్లో, 6000 చదరపు అడుగుల విస్తీర్ణంలో 4000 మంది కూర్చో గల సామర్థ్యంతో చేపడుతున్నట్లు తెలి పారు. ఆధునిక సౌండ్ సిస్టమ్, సమావే శాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహ ణకు తగిన వసతులతో ఆడిటోరియాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు. నిర్మాణానికి ఎంఎస్ఎన్ ఫార్మా రూ.8 కోట్లు, అరబిందో సంస్థ రూ. 2 కోట్లు సిఎస్ఆర్ నిధులు అందించగా, ఇటీవల జిహెచ్ఎంసి నుండి రూ.4 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మిగిలిన రూ.6 కోట్ల నిధులను వివిధ పరిశ్రమల సహకారంతో సమీకరించనున్నట్లు చెప్పారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ సురేష్, డిఈ నరేందర్, ఏఈ శివ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్

**జనం పవర్, బెల్లంపల్లి, జూలై 14:** కన్నెపల్లి మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొని మొక్కలను నాటారు. భీమిని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో వనమోత్సవం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని గుర్తుచేస్తూ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. భీమిని మండల కేంద్రం నుండి మంచిర్యాల జిల్లా కేంద్రానికి బస్ సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం భీమిని మండలంలోని జగ్గయ్యపేటలో శివకేశవ ఆలయ ప్రారంభోత్సవం చేశారు.



## బహు జనగణమన పుస్తకావిష్కరణ

**రామగిరి, జూలై 14:** మండల కేంద్రంలోని సెంటినరీకాలనీ అంబేద్కర్-పూలే చౌక్‌లో గల అంబేద్కర్-పూలే విగ్రహాల వద్ద సోమవారం జూలూరి గౌరీశంకర్ రచించిన బహుజనగణమన పుస్తకాన్ని బహుజన నాయకులు ఆవిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల బాధలతో పాటు బహుజనలకు రాజ్యాధికార ఆవశ్యకతను కవితా సంపుటి రూపంలో తన భావాలను ఈ పుస్తక రూపంలో వ్యక్తపరిచారు.

ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్, రైతుబంధు అధ్యక్షుడు మేధరవేన కుమార్ యాదవ్,బహుజన నాయకులు కాపురవేన భాస్కర్, ఆసం తిరుపతి, బుర్ర శంకర్, మేడగొని రాజన్న, ధర్ముల రాజసంపత్, గుండం రవి, మంథని సమ్మయ్య, సల్పాల సదానందం, కాట అనిల్, బీసగోని శ్రావణ్, గుమ్మడి ప్రసాద్, వేగోలపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 14:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు కొన్ని ఇలా ఉన్నాయి. సుజాతనగర్ మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామం వద్ద నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి 0.7 కుంటల భూమి కోల్పోయిన చెట్టుపల్లి ప్రభాకర్ రావు అనే రైతు తాను కోల్పోయిన భూమికి నష్టపరిహారం ఇప్పటివరకు అందలేదని కావున త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం కొత్తగూడెం ఆర్డీవో కు ఎండార్స్ చేయడం జరిగింది. కొత్తగూడెం ఎన్కె నగర్ లో నివాసం ఉంటున్న సాకా ఠాగూర్ పుష్పరాజు మాట్లాడుతూ మాట్లాడుతూ గత సంవత్సరం ఇంజనీరింగ్ విద్యను అభ్యసించడానికి కే ఎల్ ఆర్ కళాశాల నందు జాయిన్ అయ్యానని కానీ అనారోగ్య కారణం చేత కళాశాలకు వెళ్లలేకపోయానని తన ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం కళాశాలలను సంప్రదించగా మొత్తం ఫీజు చెల్లిస్తేనే తనకు సర్టిఫికెట్లు ఇస్తామని తెలియజేశారని తన తల్లిదండ్రులు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నామని కావున తనకు తన ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇప్పించవలసిందిగా చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం డి సెక్షన్ సూపర్డెంట్ కు ఎండార్స్ చేశారు. పాల్వంచ మండలం యానం బైలు గ్రామంలో నివాసం ఉంటున్న ముగితే గురవయ్య వెంకయ్య తనకు పూర్వీకుల నుండి వారసత్వంగా రాజాపురం గ్రామం శివారులో సర్వేనెంబర్ 107/72/1లో ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నదని ఆ వ్యవసాయ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమ భూమికి నలువైపులా ఉన్న వ్యక్తులు తన వారసత్వ భూమిని ఆక్రమించుకున్నారని కావున తమ భూమిని సర్వే చేసి తన ఐదు ఎకరాల భూమికి హద్దులు నిర్ణయించేటట్లు చర్యలు చేపట్టాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం పాల్వంచ తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామంలో నివాసం ఉంటున్న కుంజా తిరుపతమ్మ తాను ఒక నిరుపేద గిరిజన మహిళనని పేదరికం వలన బ్రతుకు దుర్భరంగా మారినందున బ్రతుకుతెరువు కొరకు ఏదైనా పథకం క్రింద రుణం మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం ఐటిడిఏ పిఓకు ఎండార్స్ చేశారు. అశ్వరావుపేట మండలం పేరాయి గూడెం గ్రామపంచాయతీ పరిధిలోని కొంతమంది ప్రజలు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కొరకు ఎంపిక చేసిన జాబితా నుండి అనర్హులను తొలగించి తమ గ్రామమునందు గల నిరుపేదలకు వితంతువులు, వికలాంగుల పేర్లు జాబితాలో చేర్చాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం హౌసింగ్ పిడి అశ్వరావుపేట ఎంపీడీవోకు ఎండార్స్ చేయడం జరిగింది. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయాలి

**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** సిద్దిపేట కేంద్రంలోని స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన 40 మంది గ్రామస్తులు రోడ్డు వెడల్పులో మాకు సమాచారం లేకుండా ఆర్ అండ్ బి అధికారులు మార్కింగ్ చేసి వెళ్లారని కలెక్టర్ కె హైమావతి మొరపెట్టుకున్నారు. పది సంవత్సరాల నుండి ఇదే తతంగం జరుగుతుందని, మా గ్రామానికి వచ్చి ఇండ్లు పోయేవారికి న్యాయం చేసే విధంగా ఉండాలని ఉద్దేశంతో కలెక్టర్ ను కలవడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. లేని పక్షంలో ఎటువంటి ఆందోళనకైనా మేము సిద్ధమని ముక్తకంఠంతో పెద్ద గుండవెల్లి గ్రామస్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో ఇండ్లు కోల్పోయే బాధిత కుటుంబాలు పాల్గొన్నాయి.

## తెగిపడిన లిఫ్ట్

### 11 మంది కార్మికులకు గాయాలు



**జనం పవర్, పటాన్చెరు, జూలై 14:** పటాన్చెరు నియోజకవర్గంలోని రామచంద్రపురం మండల పరిధిలోని భీరాంగూడ కమాన్ సమీపంలో సోమవారం దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ఓ బట్టల షోరూమ్‌లో మూడవ అంతస్తులో స్టిక్కరింగ్ పని కోసం వచ్చిన కార్మికులు ప్రయాణిస్తున్న లిఫ్ట్ అకస్మాత్తుగా తెగిపడింది. ఈ ఘటనలో 14 మంది కార్మికుల్లో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు, చేతులు విరిగగా, గాయాలపాలైన వారిని స్థానిక పనీషియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కూడా షోరూమ్ యాజమాన్యం ఎటువంటి స్పందన ఇవ్వకపోవడంపై గాయపడిన కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాప్ యజమాని తమను బెదిరిస్తున్నాడని వారు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు, పోలీసు శాఖ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# మేక పాలు శ్రేష్టం

### జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్





**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 14:** గేద ఆవు పాల కంటే మేకపాలు ఎంతో శ్రేష్టమైనవి అని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఫుడ్ కోర్ట్ నందు మహిళా శక్తి క్యాంటీన్ లో మేకపాల విక్రయ స్టాల్ ను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా శక్తి క్యాంటీన్ సభ్యులతో ముచ్చటించి మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా వారు విక్రయిస్తున్న ఆహార పదార్థాల వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం వారు ఇచ్చిన మేకపాలను త్రాగారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు తప్పనిసరిగా మేకపాలు త్రాగించాలని ఇవి ఎంతో శ్రేష్టమైనవి స్వచ్ఛమైనవి అని అన్నారు. జిల్లావ్యాప్తంగా రెండు లక్షల మేకలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మార్కెట్లో గేద ఆవు పాలు లీటర్ 80 రూపాయల వరకు ధర ఉన్నదని అదే ధరకు మేకపాలు కూడా విక్రయించవచ్చని ఇవి ఎంతో ఆరోగ్యకరమని తెలిపారు. జిల్లాలోని రైతులు ముందడుగు వేసి లీటర్ నుండి ప్రారంభించినప్పటికీ రైతులకు 3000 నుంచి 4000 రూపాయలు అదనపు ఆదాయం కూడా లభిస్తుంది అన్నారు. ఈ మేకపాలను విక్రయించడం ప్రారంభించడం ద్వారా జిల్లాలో సంవత్సరానికి 50 కోట్ల వ్యాపారానికి అవకాశం ఉందన్నారు. జిల్లాలో మేకల పెంపకానికి పశు గ్రాసానికి అనువైనది అన్నారు. నగరాల్లో మేకపాలతో పన్నీరు చీజ్ వంటివి తయారుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని మన ప్రాంతంలో కూడా వీటిని వినియోగించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని రైతులు ఈ దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్లు ఆనందరావు, బాలకృష్ణ, రామకృష్ణ, సంతోష్, గోపాలమిత్ర సత్యనారాయణ, మహిళా శక్తి క్యాంటీన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**బయోచార్ తయారీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్**

చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీలోని డంపింగ్ యార్డ్ లోని సెగ్రిగేషన్ షెడ్ లో మట్టి మట్టి ఇటుకలతో నిర్మించిన కోన్ టిక్ కొలిమినందు ఎండిన సర్కారు తుమ్మ, చెట్ల కొమ్మలు చిన్న చిన్న ముక్కలుగా చేసి మంట ద్వారా బయోచార్ తయారు చేసే ప్రక్రియను కలెక్టర్ జితేష్ పాటిల్ సోమవారం పరిశీలించారు. ఈ విధంగా తయారైన బయోచార్(జీవ బొగ్గు)ను గోమూత్రం గోవు పేడలో కొన్ని రోజులు నిలువ ఉంచి ఆరబెట్టి పొడిచేసి పంటలకు సేంద్రియ ఎరువుగా వాడితే భూసారం అభివృద్ధి అవుతుందని, అధిక దిగుబడులు పొందవచ్చునని కలెక్టర్ తెలిపారు. గ్రామపంచాయతీలలో గృహముల నుండి షాపుల నుండి చెత్త సేకరించేటప్పుడు తడి చెత్త పొడి చెత్తగా వేరువేరుగా సేకరించాలని ఆదేశించారు. డంపింగ్ యార్డ్ లోని సెగ్రి గేషన్ షెడ్లలో తయారుచేసిన(కూరగాయ వ్యర్థాలు) కంపోస్ట్ ఎరువును కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుభాషిని, డిఎల్పిఓ ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, డి ఆర్ డి ఏ ఈసి రాజు, ఎంఈఓ రాజేశ్వరి, ఏఈఓ మమత తదితరులు పాల్గొన్నారు.

# గోరింటాకు పెట్టుకోవడం సంప్రదాయం

### సింగరేణి సేవ సమితి అధ్యక్షురాలు జి.మధురవాణి




**జనం పవర్, భద్రాద్రి కొత్తగూడెం, జూలై 14:** చుంచుపల్లి మండలం త్రిఇంక్లైన్ బంగ్లోస్ ఏరియాలో ఉన్న క్లబ్ ఆవరణలో సింగరేణి సేవ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఆషాడ మాస గోరింటాకు పండగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన సేవా అధ్యక్షురాలు జి.మధురవాణి మాట్లాడుతూ సేవా మహిళలు లేడీస్ క్లబ్ మహిళాలందరూ గోరింటాకు పండగ కార్యక్రమం నిర్వహించడం అభినందించదగిన విషయమన్నారు. ఆషాడ మాసంలో గోరింటాకును మహిళలందరూ పెట్టుకోవడం మన సంప్రదాయమని అన్నారు. మహిళల సౌభాగ్యానికి ఆరోగ్యానికి గోరింటాకు మంచిదని భావిస్తారని అలాగే శరీరంలోని వేడిని తగ్గించడంలోను గోరింటాకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. గోరింటాకు పెట్టుకోవడం అలంకారప్రాయమే కాకుండా వారి నమ్మకాలను సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆషాడంలో ఈ కార్యక్రమం జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సేవా అధ్యక్షురాలు వి.రమ, పద్మజా కోటిరెడ్డి, కొత్తగూడెం సేవా సెక్రటరీ వై.అనిత, కొత్తగూడెం లేడీస్ క్లబ్ సెక్రటరీ సునీత మురళి, సేవా సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు, అలాగే ఇల్లందు సేవా సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**జనం పవర్, హనుమకొండ, జూలై 14:** జాగృతి పోలీస్ కళా బృందం, వరంగల్ నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఐ పి ఎస్,ఆదేశాల మేరకు ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1 :00 గంటల వరకు సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ ఆర్ ఎడ్యుకేషన్ సెంటర్ నందు ప్రోగ్రాం చేసినారు. సుబేదారి ఎస్ ఐ సుమన్, ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా వుండాలని, సైబర్ మోసాల బారిన పడవద్దని, అలాగే చదువుపై శ్రద్ధ పెట్టాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, గురించి వివరిస్తు తల్లితండ్రులు చెప్పిన మాట వినాలని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలని పలు అంశాలపై పోలీస్ జాగృతి కళా బృందం వారు ఆలపించిన పాటలు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేశాయి అలాగే స్టూడెంట్స్ తో గంజాయి, మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేసినారు. ఈ కార్యక్రమానికి సుబేదారి ఎస్ ఆర్ ఎడ్యుకేషన్ సెంటర్ ప్రిన్సిపాల్ రాజి రెడ్డి,సుబేదారి ఎస్ ఐ లు, సుమన్, ప్రకాశ్ రెడ్డి , కాలేజ్ స్టాఫ్ రమేష్ , సతీశ్ ,అధ్యాపక బృందం,బ్లూ కోట్ హెడ్ కానిస్టేబుల్స్ కళాబృందం ఇంచార్జి ఉమెన్ ఏ ఎస్ ఐ నాగమణి , సభ్యులు,హెచ్ సి ఎస్ విలియమ్, వెంకటేశ్వర్లు,రత్నయ్య పి సి పూల్ సింగ్,హెచ్ జి ఎస్, శ్రీనివాస్, నారాయణ ,విక్రమ్ రాజు, చిరంజీవి, కాలేజ్ స్టూడెంట్స్, ఇతరులు, మొత్తం 400 మంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

**జనం పవర్, మరిపెడ, జూలై 14:** మరిపెడ బంగ్లాలోని మంద వెంకన్న నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి అక్కడ రోగులకు అందిస్తున్న చికిత్స విదానాన్ని పరిశీలించగా ఎలాంటి అర్హతలు లేకుండా రోగులకు స్టెరాయిడ్ ఇంజక్షన్లు, ఆంటీ బయాటికులు, సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తూ చికిత్స చేస్తుండగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అసహనం వ్యక్తం చేస్తూ ,మంద వెంకన్న, నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేయడం జరిగింది. అంతేకాకుండా ప్రథమ చికిత్స కేంద్ర నిర్వాహకులు కేవలము ప్రథమ చికిత్స ను మాత్రమే చేయాలని, యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు, మాత్రలు ఇవ్వరాదని, ఐ వి ఫ్లూయిడ్స్ పెట్టరాదని, పేరు ముందు డాక్టర్ అని రాసుకో రాదని, అర్హత కి మించి వైద్యం చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ సిహెచ్ఓ విధ్యాసాగర్ డిప్యూటీ పారామేడికల్ ఆధికారి వనాకర్ రెడ్డి,హెల్త్ ఎడ్యుకేటర్ కెవి రాజు తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్ సర్వేయర్ శిక్షణ ప్రారంభం

**జనం పవర్, సిద్దిపేట, జూలై 14:** ట్రైనీ లైసెన్స్ సర్వేయర్ల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా మే 26వ తేదీ నుండి జులై 26 వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న ట్రైని లైసెన్సుడ్ సర్వేయర్స్ కు ఈనెల 27 మరియు 28వ తేదీలలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అందుకు సంబంధిత అధికారులు అన్ని సిద్ధం చేయాలని సూచించారు. 27న ఉదయం 10:00 గంటల నుంచి 1:00 వరకు, మరియు 2:00 గంటల నుండి 5:00 గంటల వరకు 28వ తేదీన ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు ప్రాక్టికల్స్ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని అన్ని ఏర్పాటు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ వినయ్ కుమార్, డిపిఓ దేవకీదేవి పాల్గొన్నారు.

## సెంట్రింగ్ సామాగ్రి స్వాధీనం

**జనం పవర్, పటాన్చెరు, జూలై 14:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ స్కాఫోల్డింగ్, సెంట్రింగ్ మెటీరియల్‌పై పోలీసులు దాడి నిర్వహించారు. ఒఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) వద్ద నిల్వ ఉంచిన రూ.5 లక్షల విలువైన నిర్మాణ పరికరాలను అమీన్పూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం జూన్ 21, 22 తేదీలలో ఈ అక్రమ నిల్వలపై కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో అంజన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వివిధ రకాల నిర్మాణ సామగ్రిని గుర్తించారు. వీటిలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించే పలు రకాల పైపులు, గోడల బార్లు, స్కాఫోల్డింగ్ వస్తువులు, ఇతర నిర్మాణ పరికరాలు ఉన్నాయి. ఈ అక్రమ నిల్వపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పటాన్చెరు డీఎస్పీ ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ నిందితులను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న నిర్మాణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నాం. నిందితులను అరెస్ట్ చేసిన అమీన్పూర్ సీఐ నరేష్, ఎస్‌ఐలు, క్రైం సిబ్బందిని అభినందిస్తున్నానని తెలిపారు.

## డాక్టర్ల దంపతుల మధ్య చిచ్చు పెట్టిన రీల్స్

### మహిళ డాక్టర్ ఆత్మహత్య.. పోలీసుల అదుపులో భర్త

**జనం పవర్, హనుమకొండ, జూలై 14:** రీల్స్ కలిపిన ప్రేమ పండంటి కాపురంలో చిచ్చు రేపింది. తన భర్త పరాయి యువతితో ప్రేమాయణం సాగించడం భరించలేని భార్య బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన తెలంగాణలోని వరంగల్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. వరంగల్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్ ప్రత్యూష హసన్‌పర్తిలోని తన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రుల ఫిర్యాదుతో హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భర్త సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రత్యూష.. సృజన్ భార్యభర్తలు.. ఇద్దరు డాక్టర్లే.. నగరంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సృజన్ కార్డియాలజీ డాక్టర్‌గా పని చేస్తున్నారు. మరో ఆస్పత్రిలో ప్రత్యూష డెంటిస్ట్‌గా పని చేస్తోంది. ఈ క్రమంలో ఇద్దరు వైద్యుల సంసారంలోకి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తూ పాపులారిటీ సంపాదించుకున్న ఓ యువతి ఎంట్రీ అయింది. సోషల్ మీడియాలో రీల్స్ చేసే ఓ అమ్మాయి డాక్టర్ సృజన్‌ను ఇంటర్వ్యూ చేసింది.

వాటిని రీల్స్‌గా చేసి ప్రమోట్ చేసింది. ఈ క్రమంలో సృజన్, ఆ ఇన్‌ఫ్లుయెన్సర్ మధ్య పరిచయం ప్రేమగా మారింది. ఈ వ్యవహారం తెలిసి ప్రత్యూష భర్తను నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్దలు సర్దిచెబుతూ వచ్చారు. అయినా సృజన్‌లో మార్పు రాకపోవడంతో ప్రత్యూష ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. తమ బిడ్డ మరణానికి కారణమైన సృజన్‌ను, యువతిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. వైద్యురాలి మరణం వరంగల్ నగరంలో కలకలం రేపింది. మంచి హోదాలో ఉండి కూడా వేరొక మహిళ మోజులో తన భార్యను దూరం పెట్టిన ఆ వైద్యుడుపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు, కోరుతున్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# చాట్‌జీపీటీలో అంతకుమించి!



చాట్‌జీపీటీ అనగానే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవటం, ఈమెయిల్ రాయటం, సోషల్ మీడియా పోస్ట్‌ను డ్రాఫ్ట్ చేయటం, హోంవర్క్‌లో సాయం తీసుకోవటం వంటివే గుర్తుకొస్తాయి. ఆలోచించగలగాలే గానీ దీంతో మరెన్నో పనులు చేయించుకోవచ్చు. అలాంటి చిత్రమైన పనులేంటో చూద్దామా..

**వారం ప్రణాళిక**

మాటిమాటికీ నోట్స్ రాసుకోవటం, వేర్వేరు యాప్‌లకు మారటం వంటి వాటిని ఆపేయ్యండి. వారం ప్రణాళిక వేసుకునే పనిని చాట్‌జీపీటీకి అప్పజెప్పండి. మీ ఇష్టాయిష్టాలు, ఫ్రిజ్‌లో ఉన్న కూరగాయలు, సమయాల వంటి వివరాలు దానికి తెలియజేయండి. అంతే.. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి విందు అన్నింటి ప్రణాళికను ముందుంచుతుంది. అందుబాటులో ఉన్న కూరగాయలతో ఏయే వంటకాలు చేసుకోవచ్చో చెప్పేస్తుంది. రోజూ ఏయే దుస్తులు వేసుకోవాలో తెలియక సతమతపడుతున్నా చాట్‌జీపీటీ సాయం తీసుకోవచ్చు. వాతావరణ అంచనా, ఎక్కడెక్కడికి వెళ్లాలో చెబితే సరి. నప్పే దుస్తులను తెలియజేసేస్తుంది. రంగుల ఎంపికలోనూ సాయం చేస్తుంది. వేడుకలకు తగిన ఫ్యాషన్లనూ సూచిస్తుంది.

**ప్రయాణ సన్నాహాలు**

అమెరికాకు వెళ్లిన తర్వాత చూడాల్సిన ప్రముఖ ప్రదేశాలేంటి? ట్రావెల్ వెబ్‌సైట్లలో వీటి గురించి బోలెడన్ని వివరాలు, విశేషాలు ఉంటూనే ఉంటాయి. కానీ చాట్‌జీపీటీ మరో అడుగు ముందుకేసి మీ ఇష్టాలకు అనుగుణంగా ప్రత్యేక ప్రయాణ ప్రణాళికనూ రచించగలదు. చారిత్రక ప్రదేశాల మీద ఆసక్తి, ఆహార ప్రియత్వం, కేఫ్‌లలో విశ్రాంతి తీసుకోవటం, కేవలం సరదా కోసమే వెళ్లటం.. ఇలా ప్రయాణ ఉద్దేశాలు ఏవైనా కావొచ్చు. వాటికి తగినట్టుగా మంచి మంచి ప్రదేశాలను సూచిస్తుంది. అక్కడికి తేలికగా వెళ్లటానికి మార్గాలను చూపించటం ద్వారా సమయాన్నీ ఆదా చేస్తుంది. ఆయా ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఉపయోగపడే పదాలు, పదబంధాలనూ తెలియజేస్తుంది.

**సందర్భానికి తగిన సొంత కథ**

మీ పిల్లలు కథలంటే చెవి కోసుకుంటారా? మీకు వచ్చిన కథలన్నీ ఇప్పటికే చెప్పేశారా? కొత్త కథలు తట్టక సతమతమవుతున్నారా? అయితే ఓసారి చాట్‌జీపీటీ వంక చూడండి. మీ పిల్లాడి పేరు, వయసు, ఇష్టమైన జంతువు లేదా ఆటబొమ్మ, నచ్చే విషయాల వంటి వివరాలు ఇచ్చి కథను చెప్పమని అడగండి. అప్పటికప్పుడు మంచి కథను అల్లి ముందుంచుతుంది. జానపద కథలైనా, సైన్స్ ఫిక్షన్ కథలైనా ఇట్టే గుది గుచ్చగలదు. కావాలంటే ఈ కథలను సేవ్ చేసుకోవచ్చు కూడా.

**సంక్లిష్ట విషయాలు అర్థవంతంగా..**

ఆరోగ్య బీమా పాలసీని అర్థం చేసుకోవటానికి తలబద్దలు కొట్టు కుంటున్నారా? క్రెడిట్ స్కోర్ ఎలా పెంచుకోవాలో తెలియటం లేదా? ఇవే కాదు.. ఎలాంటి సంక్లిష్ట విషయాలనైనా చాట్‌జీపీటీ తేలికగా అర్థం చేసుకునేలా వివరించగలదు. తెలుసుకోవాలనుకునే విషయాన్ని సరళీకరించమని దాన్ని అడగొచ్చు. రోజూ మాట్లాడే భాషలో అనువదించమని కోరొచ్చు. అన్నింటినీ సరళమైన భాషలో విడమరచి చెబుతుంది.

**మేధో మథనం కూడా**

కొత్తగా వ్యాపారం చేయాలనుంది, కానీ అదేంటో తెలియటం లేదు. స్నేహితుడి పెళ్లిరోజు సందర్భంగా ఓ సరదా కవిత రాయాలనుకున్నారు, కానీ పాలు పోవటం లేదు. ఇన్‌స్టాలో పోస్ట్ చేయాలి, కానీ సమయానికి విషయం తట్టటం లేదు. అంతగా ఇబ్బంది పడాల్సిన పనిలేదు. సృజనాత్మక అంశాల్లోనూ చాట్‌జీపీటీ సాయం చేయగలదని గుర్తు తెచ్చుకోండి. కొన్ని క్లూలు, మీ ఉద్దేశం, కవిత ఉండాల్సిన తీరు, ఎవరి కోసం అవసరమో వంటివి వివరంగా చెప్పి చూడండి. బోలెడన్ని ఐడియాలను ముందుంచుతుంది. కావాలంటే వాటిని సరిచేసి పెడుతుంది కూడా. అన్నింటికన్నా మంచిదేదో చెప్పమన్నా కాదనదు. ఒకరకంగా దీన్ని ఇంట్లో కూర్చునే భాగస్వామితో చర్చించటం వంటిది అనుకోండి. మంచి విషయం ఏంటంటే- మనం నచ్చలేదని చెప్పినా చాట్‌జీపీటీ ఏమీ కినుక వహించదు. అలిగి పక్కకుపోదు. వెంటే ఉంటుంది. మళ్లీ అడిగినా సలహాలు, సూచనలు ఇస్తుంది.

## బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదు..

# ఏం చేయాలంటే?




బరువు  తగ్గటమనేది అంత త్వరగా సాధ్యమయ్యేది కాదు. దీనికి సమయం పడుతుంది. ఓపికతో ఆహార, వ్యాయామ నియమాలను పాటించటం అత్యవసరం. అధిక బరువు తో మధుమేహం  అధిక రక్తపోటు  వంటి దీర్ఘకాల సమస్యల ముప్పు పెరుగుతుంది. కొన్నిరకాల క్యాన్సర్లూ తలెత్తొచ్చు. వయసు మీద పడుతున్నప్పుడు చురుకుదనమూ తగ్గుతుంది. అందుకే బరువును అదుపులో ఉంచుకోవాలని డాక్టర్లు చెబుతుంటారు. అలాగని మరీ త్వరగా బరువు తగ్గటమూ మంచిది కాదు. దీనికీ ఒక పద్ధతి ఉంది. బరువు పెరగటానికి ప్రధాన కారణం- శరీరానికి అవసరమైన వాటి కన్నా ఎక్కువ కేలరీలను తీసుకోవటం. ఖర్చు కాకుండా మిగిలిపోయిన కేలరీలు కొవ్వుగా మారిపోయి, స్థిరపడే ప్రమాదముంది. సమతులాహారం తినకపోవటం, నిద్రలేమి, తగినంత శ్రమ చేయకపోవటం వంటి రకరకాల అంశాలు దీనికి కారణమవుతుంటాయి. బరువు పెరగటంలో జన్యువులు కూడా పాలు పంచుకుంటాయి. కొన్నిరకాల మందులూ దీనికి దోహదం చేయొచ్చు. కాబట్టి వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకోవటం ఎంతైనా అవసరం. ఆరోగ్యకరమైన జీవనశైలితో బరువును అదుపులో పెట్టుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. చిన్న చిన్న మార్పులైనా పెద్ద ప్రభావమే చూపుతాయి.

**లెక్క ప్రకారం..**

శరీర ఎత్తు, బరువుల నిష్పత్తి  ఆధారంగా బరువును లెక్కిస్తారు. ఇది 25లోపు ఉండటం మంచిది. 25 నుంచి 29.6 మధ్యలో ఉంటే అధిక బరువుగా.. 30, అంతకన్నా ఎక్కువుంటే ఊబకాయంగా పరిగణిస్తారు. బరువును లెక్కించటానికి బీఎంఐ తేలికైన, సత్వర మార్గమే అయినప్పటికీ.. ఇందులో కొవ్వు మోతాదు కచ్చితంగా తెలియదు. ఒంట్లో నీరు, కండరాలు, ఎముకల బరువులన్నీ బీఎంఐలో కలిసే ఉంటాయి. నిజానికి ఎక్కువ ప్రమాదం అధిక కొవ్వుతోనే! దీని మూలంగా బీఎంఐ పెరిగినట్టయితే నెమ్మదిగా.. వారానికి 450 నుంచి 900 గ్రాముల వరకు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. కొందరు త్వరగా బరువు తగ్గటం మంచిదని భావిస్తుంటారు. కానీ ఎంత త్వరగా తగ్గితే అంతే వేగంగా పెరిగే ప్రమాదముంటుంది. నెమ్మదిగా, క్రమంగా తగ్గే బరువు స్థిరంగా కొనసాగుతూ వస్తుందని తెలుసుకోవాలి.

**తిండి మీద ధ్యాస**

బరువు తగ్గటానికి  ఆహారం ద్వారా లభించే కేలరీలను తగ్గించుకోవటంతో పాటు కేలరీలు ఎక్కువ ఖర్చయ్యేలా శారీరక శ్రమ చేయటం తప్పనిసరి. రోజులో శరీరం ఖర్చు చేసే కేలరీల కన్నా సుమారు 500 తక్కువ కేలరీలు తీసుకుంటే బరువు తగ్గుతుందన్నది నిపుణుల సూచన. దీంతో వారానికి సుమారు 900 గ్రాముల బరువు తగ్గే అవకాశముంది. కాబట్టి కేలరీలు ఎక్కువగా ఉండే పదార్థాలు, సంతృప్త కొవ్వు పదార్థాలు, వనస్పతి వంటి ట్రాన్స్‌ఫ్యాట్స్ తగ్గించుకోవాలి. అయితే అందరికీ ఒకే రకమైన ఆహార పద్ధతి ఉపయోగపడుతుందని చెప్పలేం. క్రమం తప్పకుండా కొనసాగించగలిగే ఆహార పద్ధతే అన్నింటికన్నా మంచిది. రకరకాల కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలు, వెన్న తీసిన పాలు, పాల పదార్థాలు.. మాంసాహారులైతే చికెన్, చేపల వంటివన్నీ సమపాళ్లలో తీసుకోవటం ముఖ్యం. మన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఆయా పదార్థాలను ఎంచుకుంటే మధ్యలో కట్టు తప్పకుండా చూసుకోవచ్చు. కేలరీలను లెక్కించుకొని తినటం ఎలా సాధ్యమని చాలామంది ప్రశ్నిస్తుంటారు. మితంగా తినేలా చూసుకుంటే చాలావరకు కేలరీలను తగ్గించుకోవచ్చు. చిన్న పళ్లాన్ని ఎంచుకుంటే వడ్డించుకునే పదార్థాల పరిమాణమూ తగ్గుతుంది. అలాగే ఆహారాన్ని పూర్తిగా నములుతూ, ఆస్వాదిస్తూ తినటం మంచిది. గబగబా మింగేస్తే కడుపు నిండిన విషయం మెదడుకు తెలియదు. దీంతో మరింత ఎక్కువ తినే ప్రమాదముంది.

**శ్రమ సాయం**

ఆహారంతో లభించిన కేలరీలు ఖర్చు కావటానికి శారీరక శ్రమ తోడ్పడుతుంది. వారానికి కనీసం 150 నిమిషాల సేపు ఒక మాదిరి నుంచి తీవ్రమైన వ్యాయామం(exercise) చేయాలనేది నిపుణుల సూచన. గుండె, శ్వాస వేగాలను పెంచే వ్యాయామాలైతే మరీ మంచివి. వేగంగా నడవటం, ఈత కొట్టటం, డ్యాన్స్ చేయటం వంటివన్నీ ఇలాంటివే. ఎంత మంచివైనా వ్యాయామాలను ఒకేసారి వేగంగా చేయకూడదు. క్రమంగా వేగం పెంచుకుంటూ రావాలి. దీంతో గాయాల పాలవ్వకుండా చూసుకోవచ్చు. బద్ధకంగా కూర్చోవటానికి బదులు తేలికైన వ్యాయామాలైనా చేయాలి. వీటితోనూ కేలరీలు ఖర్చవుతాయి. లిఫ్టుకు బదులు మెట్లు ఎక్కటం, అప్పుడప్పుడూ లేచి కాసేపు నడవటం వంటి చిన్న మార్పులైనా మంచి ఫలితం చూపిస్తాయి. బరువులు ఎత్తటం వంటి కండరాలను దృఢం చేసే వ్యాయామాలనూ మరవరాదు. పెద్దవాళ్లు వారానికి కనీసం రెండు రోజులైనా ఇలాంటివి సాధన చెయ్యాలి.